ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
శనివారం 26 ఏప్రిల్ 2025



మదనపల్లె ఫైల్స్ కేసులో సీఐడీ దూకుడు



మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాలిపోయిన ఫైళ్లు (ఫైల్)

● మాధవరెడ్డి అరెస్టుతో మిగిలిన నిందితుల్లో మొదలైన గుబులు
● త్వరలో ఇతర నిందితులను అరెస్టు చేసే అవకాశం

మదనపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె ఫైల్స్ కేసులో సీఐడీ స్పీడు పెంచింది. ఈ కేసులో కీలక నిందితుడిగా భావిస్తున్న, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రధాన అనుచరుడు వంకిరెడ్డి మాధవరెడ్డి అరెస్టుతో మిగిలిన నిందితుల్లోనూ గుబులు మొదలైంది. ఇప్పటికే ప్రధాన నిందితుడు సబ్‌కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్‌నాయుడును అరెస్టు చేయగా, పూర్వపు ఆర్డీవో ఎం.ఎ్‌స.మురళి ఏసీబీ కేసులో అరెస్టు అయ్యారు. అప్పటి నుంచి కేసు స్తబ్దతగా ఉండగా ఫైల్స్ కేసు మరుగున పడిపోయిందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమైంది. ఈ క్రమంలో ప్రభుత్వం కూడా కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో సీఐడీ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా భూకబ్జాలు, ఆక్రమణలకు పేరుగాంచిన వంకిరెడ్డి మాధవరెడ్డి అలియాస్ రైస్‌మిల్లు మాధవరెడ్డిని అరెస్టు చేయడంతో ఈ కేసులో పురోగతి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మాధవరెడ్డిపై అప్పట్లోనే కేసు నమోదు కాగా ముందస్తు బెయిల్‌పై కొన్ని రోజులు జనాల్లో, ఇంకొన్నాళ్లు అజ్ఞాతంలో ఉంటూ వచ్చారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న సీఐడీ అతడి బెయిల్ రద్దు చేయించి దూకుడు పెంచింది. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలోని స్వగ్రామం వద్ద ఫాం హౌస్‌లో ఉన్న మాధవరెడ్డిని గురువారం సీఐడీ వ్యూహాత్మకంగా అరెస్టు చేసి శుక్రవారం చిత్తూరు సీఐడీ కోర్టులో ప్రవేశపెట్టింది. తర్వాత రిమాండ్‌లోని నిందితుడిని విచారించేందుకు సీఐడీ కస్టడీకి తీసుకుని విచారించే అవకాశం ఉంది. అయితే మాధవరెడ్డి నోటి నుంచి ఎవరెవరి పేర్లు వస్తాయో, ఏం జరిగిందనే అంశంపై కేసు విచారణ మొదలు కానుంది. ఇప్పటి వరకు అధికారులనే అరెస్టు చేసిన సీఐడీ మొదటిసారిగా రాజకీయపరమైన నిందితులపై దృష్టి సారించింది. దీంతో మిగిలిన నిందితులైన మాజీ ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, పెద్దిరెడ్డి పీఏలు మునితుకారాం, శశికుమార్, రామకృష్ణారెడ్డిలలో గుబులు మొదలైంది. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన సీఐడీ మిగిలిన వారిని కూడా అరెస్టు చేసే అవకాశం కనిపిస్తోంది. నిందితులు ఒక్కొక్కరిగా అరెస్టు అవుతున్న నేపథ్యంలో అదే వారి ఆందోళనకు కారణమతోంది. వీరిలో మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎం.నవాజ్ బాషా, జింకా వెంకటాచలపతి బెయిల్‌పై ఉన్నారు.

గత ఏడాది జూలై 21న రాత్రి స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో భూముల కీలకమైన రెవెన్యూ ఫైల్స్‌ను దహనం చేశారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూములే కాదు ప్రైవేటు భూములు సైతం కబ్జా, ఆక్రమణకు గురయ్యాయి. ఇందులో వైసీపీ పెద్దలు, వారి అనుచరులు కీలకంగా వ్యవహరించారు. వీటితో పాటు కీలకమైన డీకేటీ, 22ఏ భూములు, పేదలు, రైతులు, అన్నదమ్ముల మధ్య కుటుంబ తగాదాల్లోని భూములను నయానో, భయానో తక్కువ ధరకు దక్కించుకున్నారు. తర్వాత వాటిని ఫ్రీహోల్డ్ చేయించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ముఖ్యంగా మదనపల్లె శివారు ప్రాంతాల్లోని బి.కె.పల్లె, బసినికొండ, పాపయ్యగారిపల్లె, వలసపల్లె, పోతబోలు, సీటీఎం, కోళ్లబైలు రెవెన్యూ గ్రామాల్లో వీరి ఆక్రమణల దందా కొనసాగింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు పెద్దఎత్తున భూఆక్రమణలకు పాల్పడ్డారు. తర్వాత ప్రభుత్వం మారడంతో అడ్డదిడ్డంగా చేసిన భూఆక్రమణల నుంచి బయటపడేందుకు ముఖ్యంగా 22ఏ ఫైళ్లు, ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించిన ఫైళ్లను లేకుండా చేసే క్రమంలో దహనం చేశారనే అభియోగాలపై కేసులు నమోదయ్యాయి. ఇందుకు అప్పటి ఆర్డీవో ఎం.ఎస్.మురళి, తర్వాత వచ్చిన ఆర్డీవో హరిప్రసాద్, సబ్‌కలెక్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్‌నాయుడుతో పాటు ఈ కేసులో కీలక నిందితుడు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రధాన అనుచరుడు వంకిరెడ్డి మాధవరెడ్డి, పెద్దిరెడ్డి పీఏ మునితుకారాంలు ఉన్నారు. తర్వాత కేసు విచారణలో భాగంగా సీఐడీ పోలీసులు అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, భూవ్యవహారాల్లో మాధవరెడ్డి ప్రధాన సహచరుడిగా చెబుతున్న రిటైర్డ్ ఉద్యోగి రామకృష్ణారెడ్డి నివాసాల్లో సోదాలు చేసి వివిధ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పెద్దిరెడ్డి పీఏలు తిరుపతిలోని మునితుకారాం, హైదరాబాద్‌లోని శశికుమార్ నివాసాల్లో సోదాలు చేసి డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. స్థానికంగా మాధవరెడ్డితో కలసి నిత్యం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కనిపించే మునితుకారాం విదేశాల్లో ఉండగా, మరో నిందితుడు శశికుమార్ హైదరాబాద్‌లో ఉంటున్నారు.





పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డి (ఫైల్)

కీలకమైన ఫైల్స్ కేసుకు అనుబంధంగా సీఐడీ పోలీసులు సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ కార్యాలయాల్లో అటు అధికారులు, ఇటు సిబ్బందిని విచారించారు. మరోవైపు ఈ ఘటన అనంతరం అప్పటి రెవెన్యూ చీఫ్ సెక్రటరీ ఆర్.పి.సిసోడియా స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాధవరెడ్డి భూబాధితులు పెద్దసంఖ్యలో ఫిర్యాదు చేశారు. వీటిపై కూడా సీఐడీ పోలీసులు, రెవెన్యూ అధికారుల నుంచి నివేదిక తెప్పించుకుని బాధితులను ప్రత్యేకంగా విచారించారు. వారి నుంచి స్టేట్‌మెంట్ కూడా రికార్డు చేశారు. సోదాల్లో నిందితుల ఇళ్లలో దొరికిన డాక్యుమెంట్లు, ఇతర రికార్డుల్లో పేరున్న వారిని కూడా ఆయా పోలీస్‌స్టేషన్లకు పిలిపించి విచారించడంతో పాటు వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అలాగే ప్రధాన నిందితుడు మాధవరెడ్డికి సహకరించిన, 22ఏ ఫైళ్లలో సంతకాలు చేసిన వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందిని తిరుపతిలోని సీఐడీ కార్యాలయానికి పలుమార్లు పిలిపించి విచారించారు. ప్రస్తుతం వీరిలోనూ ఆందోళన మొదలైంది. కేసు మా మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనని భయపడుతున్నారు. మొత్తమ్మీద తీసుకుంటే. మాధవరెడ్డి అరెస్టుతో భూబాధితుల్లో కేసు పురోగతిపై కాస్త నమ్మకం కలిగినట్లు కనిపిస్తోంది.



మాధవరెడ్డి ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసులు (ఫైల్)



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఇన్‌చార్జ్ ఎంపీడీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

బాధ్యతగా పనిచేయండి

● అధికారులతో కలెక్టర్ చామకూరి శ్రీధర్

పెద్దమండ్యం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అధికారులు బాధ్యతగా పనిచేయాలని చామకూరి శ్రీధర్ ఆదేశించారు. పెద్దమండ్యం మండలంలో శుక్రవారం కలెక్టర్ పర్యటించారు. మొదటగా పెద్దమండ్యంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ తడి, పొడి చెత్త, ప్లాస్టిక్‌ను ఎందుకు వేరు చేయలేదని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీధర్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజువారీగా తడి, పొడి చెత్త సేకరణ వివరాలు తెలియజేయాలని పెద్దమండ్యం పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యంను ఆదేశించారు. గ్రామీణ రహదారుల పక్కన ఉన్న చెత్తకుప్పలను తొలగించాలని చెప్పారు. డీఎల్‌పీవో నాగరాజు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రికి తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని డాక్టర్లు ఇమ్మానుయేల్, హరివర్మ, వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మంచి వైద్యం అందించాలన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చదనం, పారిశుధ్యం అమలుతో ప్రజల ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చన్నారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. వేసవిలో టమోటా సాగుకు, మామిడి నిల్వలకు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు సూచనలు ఇవ్వాలని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులకు సూచించారు. ప్రభుత్వం అందించిన అదనపు ఆర్థిక సహాయంతో సకాలంలో పక్కాగృహాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ప్రజల నుంచి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఆర్‌ఐ సయ్యద్ ఇమ్రాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మలేరియా రహిత జిల్లాగా చేద్దాం

● జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పిలుపు

రాయచోటి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలతో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం ద్వారా జిల్లాను మలేరియా రహిత జిల్లాగా తయారు చేద్దామని జిల్లా మలేరియా అధికారి ఆర్.రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాయచోటిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి నేతాజీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజలు తాము నివసిస్తున్న ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు ఇంటి పరిసర ప్రాంతాలలో నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిర్మూలనా చర్యలు చేపట్టాలని తెలిపారు. మలేరియా జ్వరం లక్షణాలు, నివారణా మార్గాల గురించి, దాని వ్యాప్తి గురించి ప్రజలకు వివరించాలన్నారు. 2027 నాటికి జీరో మలేరియాను, 2030 నాటికి పూర్తి స్థాయిలో మలేరియాను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కిరణ్‌కుమార్, శివరామ్ రాజ్, రాయచోటి సబ్ యూనిట్ ఆఫీసర్ జయరామయ్య, హెచ్‌ఈ బలరామరాజు, ల్యాబ్ టెక్నీషియన్లు నాయక్, వెంకట్రామిరెడ్డి, ఉత్తమ్ రెడ్డి, శ్రీనాథరెడ్డి, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరెడ్డి, నూర్జహాన్, అసిస్టెంట్స్ రవిరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



రాయచోటిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖాధికారులు

నాటుసారాపై ఉక్కుపాదం మోపండి

● ఉమ్మడి కడప జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్

రాయచోటి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపి అన్నమయ్య జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా చేద్దామని ఉమ్మడి కడప జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ పిలుపునిచ్చారు. రాయచోటిలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన జిల్లాలోని ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలను పూర్తి స్థాయిలో నియంత్రించడంతో పాటు నేరస్థులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా జిల్లాలో నాటు సారా ప్రభావితమైన వాల్మీకిపురం, మదనపల్లె, ములకలచెరువు, పీలేరు ప్రాంతాల్లో కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు అటువంటి వారిని బైండోవర్ చేసి పీడీ యాక్టు అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నాటుసారా తయారు చేసే ప్రాంతాలను గుర్తించేందుకు అవసరమైతే డ్రోన్ కెమెరాలను కూడా వినియోగించుకోవాలన్నారు. అలాగే ఆయా స్టేషన్‌ల రికార్డులను సరిగ్గా నిర్వహించడమే కాకుండా సిబ్బంది పనితీరు కూడా మెరుగుపడాలన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ జయరాజ్

సర్వర్ సమస్య

● అప్‌లోడ్‌కాని పింఛనుదార్ల వివరాలు
● అన్నమయ్య జిల్లాలో 3316 మంది
● కడప జిల్లాలో 3585 మంది అర్హులు

కలికిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య పింఛను తీసుకుంటూ మరణించిన భర్తలకు బదులుగా వారి భార్యలకు వితంతు పింఛను మంజూరు చేసేందుకు ప్రభుత్వం కొత్తగా తెచ్చిన విధానం తొలిరోజు సర్వర్ సమస్య కారణంగా వివరాలు అప్‌లోడ్ చేయడానికి సాధ్యపడలేదు. గతంలో కుటుంబంలో వృద్ధాప్య పింఛను పొందుతూ మరణిస్తే అదే కుటుంబంలోని అతడి భార్యకు వితంతు పింఛను మంజూరు కావడానికి ఏళ్ల కాలం పట్టేది. ప్రస్తుత ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికి వృద్ధాప్య పింఛనుదారుడు మరణిస్తే ఆ మరుసటి నెల నుంచి అతడి భార్యకు పింఛను మంజూరయ్యే ప్రక్రియను అమలు చేసేందుకు పూనుకుంది. దీనికనువుగా ఇప్పటికే ఏడాదికి పైగా పేరుకుపోయిన ఇలాంటి పింఛన్లన్నిటికీ ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. దీని ప్రకారం 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్యలో చనిపోయిన వృద్ధాప్య పింఛనుదార్ల జాబితాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. వీరందరికీ మే 1వ తేదీ పింఛన్లు పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో శుక్రవారం నుంచి ఈ ప్రతిపాదనలు అప్‌లోడ్ చేయాల్సి ఉండగా ఉదయం నుంచి సర్వర్లు మొరాయించడంతో ప్రతిపాదనలన్నీ ఎక్కడివక్కడే ఆగిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ మొత్తం 89,778 మందిని అర్హులుగా తేల్చి ఆ మేరకు గ్రామ, వార్డు సచివాలయాలకు పంపారు. అన్నమయ్య జిల్లాలో 3316 మంది, కడప జిల్లాలో 3585 మంది అర్హులుగా ఉన్నారు. సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు రోజంతా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఇక కేవలం ఐదు రోజులు కూడా గడువు లేకపోవడంతో మే నెలలో కొత్త వితంతు పింఛన్లు మంజూరవుతాయా లేదా అని అర్హుల్లో ఆందోళన నెలకొంది.



మట్టిని తవ్వేస్తున్నారు...

● లాల్‌మాన్‌చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు
● ఎక్స్‌కవేటర్, టిప్పర్లతో మట్టి తరలింపు
● రెచ్చిపోతున్న వైసీపీ నాయకులు



లాల్‌మాన్‌చెరువులో... రామాపురం వద్ద హంద్రీ-నీవా మట్టిని ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న దృశ్యం

గుర్రంకొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పరిసరాలలో మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. చెరువులు, గుట్టల వద్ద ఎక్స్‌కవేటర్లను ఉంచి యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. దీంతో ప్రతిరోజూ వందల సంఖ్యలో మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇటుక బట్టీల వ్యాపారులు ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తవ్విస్తున్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై సమీప రైతులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు చెప్పినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ నాయకుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోయిందని కూటమి నాయకులు వాపోతున్నారు. వీరి అక్రమాలను ప్రశ్నిస్తే వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

చెరువులను గుల్ల చేస్తున్నారు...

గుర్రంకొండ పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూముల్లో లేఅవుట్‌లను వేస్తున్నారు. ఈ క్రమంలో భూమిని చదును చేసి మట్టిని తోలి లేఅవుట్‌లను వేస్తున్నారు. వీటికి మట్టి కోసం చెరువులను ఎక్స్‌కవేటర్‌లతో ఇష్టానుసారంగా తొలచి వేస్తున్నారు. అంతేకాకుండా కుంటలు, చెరువుల్లో ఎక్కడ పడితే అక్కడ గుంతలను చేస్తున్నారు. రామాపురం పంచాయతీ పరిధిలోని లాల్‌మాన్‌చెరువులో రెండు రోజులుగా వైసీపీ నాయకులు ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తవ్వి టిప్పర్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తరలిస్తున్నారు. మట్టి తరలింపుపై రైతులు రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు అడ్డుకున్నారు. దీంతో వైసీపీకి చెందిన మట్టి మాఫియా నాయకులు పగటి పూట మట్టి తవ్వకాలను నిలిపివేసి రాత్రి పూట యథేచ్ఛగా లేఅవుట్‌లకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో చెరువులు, గుట్టల వద్ద ఎక్స్‌కవేటర్లను ఉంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని తవ్వి గుల్ల చేస్తున్నారు. దీంతో చెరువులు రూపురేఖలు కోల్పోతున్నాయి.

ట్రాక్టర్ మట్టికి రూ.200 ఇవ్వాల్సిందే

గుర్రంకొండ పట్టణంలో ఎవరికైనా మట్టి తోలాలంటే ముందుగా మామూళ్లు ఇవ్వాల్సిందే అంటూ కొందరు నాయకులు ఆదేశిస్తున్నారు. దీంతో మట్టి మాఫియాకు చెందిన వారందరూ వెళ్లి ఆ నాయకుడితో మాట్లాడారు. ఈ క్రమంలో చెరువులు, గుట్టల నుంచి ట్రాక్టర్ మట్టి తోలాలంటే రూ.200 తమకు చెల్లించాలని ఒప్పందం కుదుర్చుకొన్నారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా గుర్రంకొండలో మట్టి మాఫియా విచ్చలవిడిగా మట్టిని తరలిస్తోంది.

మట్టి అక్రమంగా తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తాం

ప్రభుత్వ భూములు, గుట్టలు, చెరువుల్లోనుంచి మట్టిని అక్రమంగా తరలిస్తే వారిపై చర్యలు తప్పవు. మట్టి తరలింపునకు సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. లాల్‌మాన్‌చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు తెలియడంతో సిబ్బంది పంపడంతో అక్రమార్కులు పరారయ్యారు. మట్టి వ్యాపారులు అక్రమాలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తాం.

- శ్రీనివాసులు, తహసీల్దార్, గుర్రంకొండ

రాజంపేట... సమస్యలు తిష్ఠ

● దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలు
● నాలుగు వైపులా అధ్వానమైన రోడ్లు
● కనీస అభివృద్ధి లేక అవస్థలు పడుతున్న ప్రజలు
● పట్టించుకోని పాలకులు

4



పాకిస్థాన్ భారీ మూల్యం చెల్లించక తప్పదు

● జిల్లావ్యాప్తంగా నిరసనల వెల్లువ

రాయచోటి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులపై కశ్మీర్‌లో జరిపిన ఉగ్రదాడికి పాకిస్థాన్ భారీ మూల్యం చెల్లించక తప్పదని విశ్వహిందూ పరిషత్ నాయకులు, ముస్లింలు తేల్చి చెప్పారు. కశ్మీర్‌లో ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు, కొవ్వొత్తుల ర్యాలీలు జరిగాయి. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతూ రైల్వేకోడూరు గాంధీ విగ్రహం వద్ద నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం అక్కడే మానవహారం నిర్వహించా రు. అలాగే విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాకిస్థాన్ దేశ జెండాను దహనం చేశారు. అలాగే మదనపల్లె, పీలేరు, కలికిరి, గుర్రంకొండతో పాటు జిల్లావ్యా ప్తంగా పలుచోట్ల పార్టీకతీతంగా నాయకులు, ప్రజలు, ముస్లింలు నిరసనలు చేపట్టి పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



ఉగ్రవాదుల దాడులకు నిరసనగా రైల్వేకోడూరులో ర్యాలీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

రాజంపేట... సమస్యలు తిష్ఠ



- దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలు
- నాలుగు వైపులా అధ్వానమైన రోడ్లు
- కనీస అభివృద్ధి లేక అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు


రాజంపేటలో బస్‌స్టాపు లేక ఎర్రటి ఎండలో అలమటిస్తున్న ప్రయాణికులు

రాజంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గంలో అనేక దీర్ఘకాలిక సమస్యలున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. అనేక ఏళ్లుగా ఈ సమస్యలు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నా వాటి పరిష్కార మార్గం వైపు నాయకులు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా కడప-రేణిగుంట రాష్ట్ర రహదారిలో ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు పెరిగిపోయాయి. వాహనాలకు తగ్గట్లు దారి వెడల్పు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీనివల్ల ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ రోడ్డును 4 లేన్లుగా ఏర్పాటు చేసి పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం కలగలేదు. ప్రధానంగా ఈ రహదారి రాజంపేట ప్రజలకే కాక కోడూరు, కడప, కమలాపురం ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు, కర్నూలు, బళ్లారి, మహారాష్ట్ర వాసులు తిరుమలకు ఎక్కువగా ఈ రహదారిలోనే వెళుతుంటారు. దీనికి సుమారు రూ.3600 కోట్లు రెండేళ్ల కిందటే మంజూరయ్యాయి. రెండేళ్ల కిందటే ఈ పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. అయితే కోడూరు నుంచి రేణిగుంట వరకు అటవీ మార్గంలో వెళ్లే రహదారికి కేంద్ర ప్రభుత్వం జంగిల్ క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. ఇంతవరకు ఇవ్వకపోవడం వల్ల ఆ రోడ్డు పనులు జరగడం లేదు.

అదేవిధంగా రాజంపేట నుంచి రాయచోటికి, రాజంపేట నుంచి రాపూరుకు వెళ్లే రెండు ఘాట్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాజంపేట నుంచి జిల్లా కేంద్రమైన రాయచోటికి రోడ్డుమార్గం పూర్తిగా పాడై ఉంది. రెండు ఘాట్ అటవీ మార్గంలో వెళ్లే ఈ రహదారికి డబుల్‌లేను కూడా పూర్తి చేయలేదు. రాపూరుకు, నెల్లూరుకు వెళ్లే మార్గంలో అన్నమయ్య జిల్లా సరిహద్దు వరకు డబుల్ లేను రోడ్డు పనులు పూర్తి చేశారు. నెల్లూరు జిల్లా సరిహద్దు నుంచి రాపూరు వరకు రోడ్డును వదిలేశారు. ఘాట్‌రోడ్డులో రోడ్డు వేయకపోవడం వల్ల ఈ మార్గంలో ప్రయాణం చేయడం చాలా కష్టంగా ఉంది.


నిధులు లేక నిలిచిపోయిన రాజంపేట-రాయచోటి రోడ్డు పనులు

పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో అన్ని రహదారులు ఇరుకిరుకుగా ఉన్నాయి. రైల్వేస్టేషన్‌కు వెళ్లాలన్నా, పాతబస్టాండు నుంచి మార్కెట్‌కు రావాలన్నా వెడల్పు లేని రోడ్లతో పూర్తిగా రోడ్లన్నీ ఆక్రమణలతో ట్రాఫిక్ ఎక్కువై ఎటూ పోలేని పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. అసలు పట్టణంలో ద్విచక్ర వాహనం పెట్టుకోవాలన్నా ఇబ్బందిగా ఉంది. వెంటనే రాజంపేట పట్టణంలో రోడ్లను వెడల్పు చేయాల్సి ఉంది. ఇక హత్యరాల, తాళ్లపాక, రాజంపేట ప్రాంతాలను అనుసంధానం చేసి చుట్టూ రోడ్డు సౌకర్యాన్ని కల్పించి పుణ్యక్షేత్రాలైన అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక, పాపవినాసినిగా పేరొందిన హత్యరాల, రాజంపేట ప్రాంతంలో టూరిస్టు హబ్‌గా ఏర్పాటు చేయదలచిన అంశం మరుగునపడిపోయింది. పట్టణానికి ప్రధానంగా చక్రాలమడుగు నది సుందరీకరణ ప్రధానమైనది. పట్టణంలోని మురికినీరు అంతా రాజంపేట పట్టణ నడిబొడ్డున ఉన్న చక్రాలమడుగుకు చేరుతోంది. ఈ నీటిని దిగువ ప్రాంతాలకు పంపి ఆక్రమణలకు గురైన చక్రాలమడుగును సుందరీకరణ చేసి చెట్ల పెంపకాన్ని చేపట్టి పర్యావరణ పరిరక్షణ నిర్వహిస్తే పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉంటాయి. సుండుపల్లె, వీరబల్లె వాసులకు ప్రధాన సమస్య నీటి సమస్య. కావున వెను వెంటనే ఈ మండలాల్లో చెయ్యేరు నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాలను పూర్తి చేసి తాగునీటి సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉంది.


నందలూరు చెయ్యేటిలో శిథిలావస్థకు చేరుకున్న రక్షిత మంచినీటి పథకం

అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిన తర్వాత ఆ ప్రాజెక్టు మార్గంలో 800 కోట్లతో పునరుద్ధరించాలన్న ప్రాజెక్టు పనులు అక్కడికక్కడే నిలిచిపోయాయి. నిధులు లేని వల్ల ఈ పనులు ఇప్పుడు ప్రారంభించే అవకాశాలు లేవు. దీనికి ప్రయత్నంగా చెయ్యేరు పొడవునా సుమారు 70 కిలోమీటర్ల వ్యవధిలో ఐదు కిలోమీటర్లకు ఒక చెక్‌డ్యాంను ఏర్పాటు చేసి వర్షాకాలంలో నీరు చెక్‌డ్యాంలకు చేర్చి భూగర్భజలాలు పెరిగి సస్యశ్యామలం అవుతుంది. నియోజకవర్గంలో ఒంటిమిట్ట, రాజంపేట, నందలూరు, ప్రాంతాల్లో ఎక్కువ చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిని పునరుద్ధరించి పూడికలు తీసి కాలువలు మరమ్మతులు చేస్తే ఈ నీటి వనరుల ద్వారా తాగునీటి సౌకర్యం ఏర్పడుతుంది. ప్రధానంగా రాజంపేట నుంచి వీరబల్లెకు, సుండుపల్లెకు, సిద్దవటం, ఒంటిమిట్ట, నందలూరు, మండల కేంద్రాల్లోని గ్రామీణ ప్రాంతాలకు సరైన బస్సు సౌకర్యం లేదు. గతంలో రాజంపేట ఆర్టీసీలో 150 బస్సులు ఆర్టీసీవి ఉండగా అవి ఇప్పుడు 70 బస్సులకు కుదించారు. అద్దె బస్సులతోనే పట్టణాలకు బస్సులు నడుపుతున్నారు. పల్లె ప్రాంతీయులు బస్సులు లేక ఆటోలు, మోటారు సైకిళ్లపై ప్రయాణం చేయాల్సి వస్తోంది. కావున అదనపు బస్సులు ఏర్పాటు చేయాల్సి ఉంది.

చెరువులు, కాలువలు, కుంటలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. వెంటనే ఈ ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. ఈ విధంగా నియోజకవర్గంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారు. అధికార పార్టీలో ఎమ్మెల్యే లేకపోవడం, ఉన్న నేతల్లో నాయకత్వ పోరు వల్ల తమ రాజకీయ ఉనికికోసమే పోరాడుతున్నారే తప్ప నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించేవారు కరవయ్యారు.

ఇన్‌చార్జి మంత్రికి విన్నవించాం



రాజంపేట నియోజకవర్గంలోని పలు సమస్యల గురించి అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి విజ్ఞాపన పత్రాన్ని అందించాము. నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని మంత్రి దృష్టికి తీసుకుపోయాము. రోడ్లు, ఆక్రమణల సమస్య, తదితర అన్ని సమస్యలను మంత్రి దృష్టికి లిఖితపూర్వకంగా విజ్ఞాపన పత్రాన్ని అందించాము. త్వరలో ఈ పనులపై సమీక్షించి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

- ప్రతాప్‌రాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, రాజంపేట

నాలుగు లేన్ల రోడ్లపై కేంద్ర మంత్రితో చర్చించాం

కడప-రేణిగుంట నాలుగులేన్ల రోడ్ల పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి ద్వారా ఇటీవలే ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చలు జరిపి విజ్ఞాపనపత్రాలను కూడా అందజేశాం. త్వరలో ఫారెస్ట్ క్లియరెన్స్ వచ్చిన వెంటనే పనులు చేపడతామని మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు. త్వరలో ఈ పనులు ప్రారంభం కానున్నాయి.


నాలుగు లైన్ల రోడ్లపై కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న సాయిలోకేష్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాజంపేటటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో శుక్రవారం రెడ్డిచర్ల చిన్నప్ప(50) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... చిన్నప్ప గొర్రెల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇందులో భాగంగా గూడూరులో గొర్రెలను కొని వాటిని సానిపాయిలోని స్వగృహానికి వచ్చే మార్గమధ్యంలో రోళ్లమడుగు సమీపంలో మినీ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో చిన్నప్ప తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో వారు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. కాగా చిన్నప్పకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గాదెల వీఆర్‌ఏపై దాడి


గాయపడిన వీఆర్‌ఏ పెంచలయ్య

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదెల గ్రామ పంచాయతీలోని విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ కొత్త పెంచలయ్యను అదే గ్రామానికి చెందిన వ్యక్తి కర్రతో దాడి చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ మహేష్ తెలిపారు. నూకనపల్లె గ్రామ పరిధిలో రెవెన్యూశాఖ రీసర్వే కార్యక్రమంలో విధులు నిర్వహించి తమ సొంత గ్రామమైన గాదెలకు వెళ్లడంతో గ్రామంలో ఉన్న కొత్త మణి అను వ్యక్తి పాతకక్షలు మనసులో పెట్టుకుని దాడి చేయడంతో తలకు గాయమై తీవ్ర రక్తస్రావమైంది. దీంతో అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొన్నారు. అనంతరం తహసీల్దారు శ్రీధర్‌రావు ఆసుపత్రికి వచ్చి బాధితుడిని పరామర్శించి వీఆర్‌ఏపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో ఆకస్మిక తనిఖీలు


పోస్టాఫీసులో తనిఖీ చేస్తున్న వెంకటరెడ్డి

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె పోస్టాఫీసును శుక్రవారం కర్నూలు రీజనల్ పోస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ బీపీ వెంకటరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోస్టల్‌శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజల్లోకి చేరువయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అలాగే పొదుపు ఖాతాలు, బీమా పాలసీలు, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పోస్టల్ ఏఎస్పీ రామశంకర్, ఇన్‌స్పెక్టర్ జయశంకర్ వెంట ఉన్నారు. కార్యక్రమంలో సబ్‌పోస్టుమాస్టర్ శ్రీనివాసులు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురం కోర్టు ఏజీపీగా శ్రీనివాసులు నియామకం

కలికిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా బొలిశెట్టి శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఆయన ఈ కోర్టులో ప్రభుత్వం తరఫున సివిల్ కేసులను వాదిస్తారని ఉత్తర్వులో పేర్కొన్నారు. మూడేళ్లపాటుగానీ ఆలోగా జారీ చేసే ఉత్తర్వుల మేరకుగానీ ఆయన ఏజీపీగా కొనసాగనున్నారు. నెలకు రూ.10 వేల గౌరవ వేతనం చెల్లించనున్నట్లు పేర్కొంటూ రాష్ట్ర న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి. ప్రభావతి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

గంగమ్మతల్లి జాతరకు పటిష్ఠ బందోబస్తు

- డ్రోన్ కెమెరాతో జాతర కార్యక్రమాలపై నిఘా
- రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్‌హెగ్డే


గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న ఏఎస్పీ

రైల్వేకోడూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు గంగమ్మతల్లి జాతర కార్యక్రమాలు ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్‌హెగ్డే తెలిపారు. శుక్రవారం మొదట గంగమ్మతల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గంగమ్మజాతర ప్రాంతాలు, దారులు తదితర వాటిని పరిశీలించారు. రైల్వేకోడూరుకు ఎక్కువగా భక్తులు వస్తారు కాబట్టి డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జేబు దొంగలపై పటిష్ఠ నిఘా ఉంటుందన్నారు. చుట్టుపక్కల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు తెలిపామన్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెల 29న పోలీసులు రైల్వేకోడూరుకు చేరుకుంటారని ఏఎస్పీ తెలిపారు. జాతరలో ఎలాంటి సమస్య వచ్చినా అందుకు నిర్వాహకులే బాధ్యులుగా ఉండాలని ఆదేశించారు. ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు సీఐ కే.హేమసుందరరావు, ఎస్‌ఐ నవీన్‌బాబు, జాతర కమిటీ చైర్మన్ రాంబాబు, కమిటీ సభ్యులు పోకల సుబ్బరాయుడు, పంద్రా పెద్దోడు, పోతురాజు నవీన్, పోతురాజు సుమన్, ఉంగరాల చంద్ర, చెన్నంశెట్టి సుబ్బా, కదిరి సాయి, ఉంగరాల సాయి, యెలిశెట్టి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల్లో పురోగతి సాధించాలి

కేసుల్లో పురోగతి సాధించాలని రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్‌హెగ్డే తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన పలు కేసులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియతో మాట్లాడుతూ కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించామన్నారు. సీఐ కె.హేమసుందరరావు, ఎస్‌ఐ జి.నవీన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్ట్రాటెక్ భూముల కాలుష్యంపై ఆర్డీవో విచారణ


ఐసీయల్ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో, పక్కనే తహసీల్దార్ శోభన్‌బాబు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ చిలంకూరులోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో శుక్రవారం పర్యటించారు. ఇటీవల ఫ్యాక్టరీపై జరుగుతున్న దుమారం, వివాదం చినికిచినికి గాలివానలా మారుతోంది. గతంలో ఫ్యాక్టరీకి 2200 ఎకరాల భూములు తీసుకున్నారు. అయితే ఇటీవల ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి యాజమాన్యానికి మధ్య వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఐసీఎల్ చుట్టూ ఉన్న భూముల్లో పంటలు పండించుకోలేక పోతున్నామని, ఐసీయల్ నుంచి వచ్చే కాలుష్యం తీవ్రంగా ఉందని, కలమల్ల గేటు వద్ద రోడ్లు నాశనమయ్యాయని, సమీప గ్రామాలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని, గతంలో ఉన్న స్కూల్స్ మూసివేశారని, వైద్యం అందించం లేదన్న విమర్శలున్నాయి. బ్లాస్టింగ్‌తో ఇళ్లు, భూముల్లో పగుళ్లు వచ్చాయని, తమకు ఉపాధి కల్పించడం లేదని, వీటిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదులు రావడంతో ఆయన ఆర్డీవోను విచారణకు పంపినట్లు తెలిసింది. ఆర్డీవోను కలిసిన రైతులు, ఎంపీటీసీలు కూడా ఆర్డీవోకు తమ సమస్యలను వివరించారు. అయితే విలేకరులకు, స్థానిక భూములు కోల్పోయిన వారికి సమాచారం ఇవ్వకుండా ఈ విచారణ చేశారు. స్థానికంగా ఉన్న ఎంపీటీసీ నవీన్‌కుమార్, బీజేపీ నాయకుడు సత్యం స్వామి, కొందరు రైతులతో ఆర్డీవో మాట్లాడారు. అనంతరం యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడారు. కాలుష్య నివారణ మండలి అధికారులతో కలిసి ఆమె కాలుష్యాన్ని పరిశీలించారు. ఈ విచారణ అనంతరం పూర్తి నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు సమాచారం. ఈ విషయంపై తహసీల్దార్ శోభన్ బాబును వివరణ అడుగగా ఆర్డీవో చిలమకూరు అల్ట్రాటెక్‌లో అధికారులతో, కొందరు రైతులతో మాట్లాడారని తెలిపారు.

ఉపాధి పనుల్లో రూ.20 లక్షలు దుర్వినియోగం

- ఏపీవోపై ఎంపీపీ ఆగ్రహం



ఉపాధి అక్రమాలపై ఆధారాలు చూపిస్తున్న ఎంపీపీ

పుల్లంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 'మీ ఇష్టం వచ్చినట్లు ఉపాధి పనులు జరుగుతున్నాయి. లక్షలాది రూపాయలు దుర్వినియోగమవుతున్నాయి. ఏసీ రూములో కూర్చొని ఏమి చేస్తున్నావ్? మీ వాటా ఎంత? టీఏ వాటా ఎంత? ఈసీ ఎంత అంటూ ఏపీవో శ్రీనివాసులుపై మండల అధ్యక్షుడు ముద్దా బాబుల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మండలంలో జరిగిన ఉపాధి అక్రమాలపై ఆధారాలతో సహా ఎంపీపీ అధికారులకు సూచించారు. మండలంలోని వత్తలూరు పంచాయతీలో జనాభా 4250 కాగా అక్కడ పనిచేసే కూలీలు వెయ్యి మంది. ఇది సాధ్యమా ? 150 మంది కూలీలు వస్తే వెయ్యి మంది పేర్లు నాలుగైదు మస్టర్లలో ఒకే ఫొటోలు, కాని కూలీల పేర్లు మాత్రం వేరు. మస్టర్‌లో ఉన్న ఫొటోల్లో ఒక గ్రామానికి చెందినవారు ఉంటే కూలీలు పేర్లు మాత్రం మరో గ్రామానికి చెందినవారివి ఉన్నాయని, దీనిపై సమాధానం చెప్పాలని ఎంపీపీ ఏపీవోను నిలదీశారు. తిప్పాయపల్లె పంచాయతీలో రౌడీషీటర్ క్రిమినల్‌గా ఉన్న వ్యక్తిగా మేట్‌గా ఎలా పనిచేస్తారు. మండలంలో 21 పంచాయతీల్లో మొత్తం కూలీలు 3029 మంది. ఒక వత్తలూరు పంచాయతీలో వెయ్యి మంది కూలీలు 20 లక్షలకు పైగా దుర్వినియోగమైంది. అనంతసముద్రం పంచాయతీలో కక్షలు, ఘర్షణలకు వీరు ఆజ్యం పోస్తున్నారంటూ ఏపీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఏపీవో శ్రీనివాసులు సభలో మట్లాడుతూ గత ఐదేళ్లుగా ఇలానే జరుగుతుందని చెప్పడంతో తమ ప్రభుత్వంలోనే చర్యలు తీసుకోవాలని ఎన్నోసార్లు చెప్పా అంటూ ఎంపీపీ సభకు వివరించారు. పుల్లంపేట మండలంలో 176 గ్రామాలు ఉండగా ప్రతి గ్రామంలో 2 నుంచి 4 బెల్ట్ షాపులు ఉన్నాయని, ఒక్కో బాటిల్‌పై రూ.80 అదనంగా వసూలు చేస్తున్నారని, దీనిపై ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. శ్మశాన స్థలం ప్రహరీ కూల్చివేత, బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ సీఐ పాత్ర, ఉపాధి అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు ఉపాధి హామీ పీడీకి, ఎక్సైజ్ కమిషనర్‌కు తీర్మానం చేసి పంపాలని, ఎంపీపీ ఎంపీడీవో వరప్రసాద్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అరవిందకిషోర్, మండల ఉపాధ్యక్షుడు బోగా వెంకటసుబ్బరత్నమ్మ, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- డీఆర్‌వో మధుసూదన రావు


పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షపై సమీక్షిస్తున్న డీఆర్‌వో మధుసూదనరావు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌వో మధుసూదన రావు తెలిపారు. తన చాంబర్‌లో శుక్రవారం ఆయన ప్రవేశ పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వర్తించి ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు ఏర్పాటు చేయాలని మునిసిపాలిటీ వారిని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని తహసీల్దార్లను ఆదేశించారు. గ్రామీణ విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా రవాణా సౌకర్యం కల్పించాలని రవాణా శాఖాధికారులను ఆదేశించారు. హెల్త్ టీమ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఎదురుకాకుండా చూడాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. పరీక్ష పూర్తయ్యేంత వరకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. సమావేశంలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె, కలికిరి పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

పులివెందుల వైద్య కళాశాల ప్రొఫెసర్ రిటైర్‌మెంట్‌కు అనుమతి

కలికిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలలో సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ డి.శంకర్‌రెడ్డి రాజీనామాను ఆమోదిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యక్తిగత కారణాలతో ఆయన రాజీనామా చేసిన 2024 జూలై 29 నుంచి ఈ రాజీనామా అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి.హోస్‌మణి శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

ఫారెస్టు సెక్షన్ ఆఫీసరుకు పదోన్నతి

కలికిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వ్యక్తిగత సహాయకురాలిగా పనిచేస్తున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసరు ఓ.రష్మీ మణికి డిప్యూటీ రేంజరుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెను రాజంపేట రేంజి తుమ్మలబయలు సెక్షను డిప్యూటీ రేంజి ఆఫీసరుగా నియమించింది. అయితే, రష్మీ మణి ఎమ్మెల్యే పీఏగా కొనసాగుతారని, ఆ మేరకు అన్నమయ్య జిల్లా కలెక్టరు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.వి.శేషగిరిబాబు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

తొమ్మిది మంది బైండోవర్

రామసముద్రం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 9 మంది సారా, కర్ణాటక మద్యం అక్రమ అమ్మకాల నిందితులు పార్వతమ్మ, సునీల్‌బాబు, భానుప్రకాష్, పవిత్ర, మంగమ్మ, వెంకటరమణ, మంజుల, రవిలను శుక్రవారం స్థానిక తహసీల్దార్ నిర్మలాదేవి ముందు బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ జబావుల్లా తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీ రికార్డులు స్వాధీనం

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్లపల్లె పంచాయతీ రికార్డులను శుక్రవారం డీఎల్‌పీవో నాగరాజు స్వాధీనం చేసుకున్నారు. చేపలవేలం డబ్బు విషయంపై పోతుపేట సర్పంచ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డీఎల్‌పీవో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు బూర్లపల్లె ఇంచార్జ్ కార్యదర్శి విష్ణు తెలిపారు.

రయ్ రయ్ మంటూ...



- మైనర్ల ర్యాష్ డ్రైవింగ్ ● ప్రమాదాల బారిన యువత
- ఎదుటి వారి ప్రాణాలు మీదకు తెస్తున్న వైనం
- కౌన్సెలింగ్‌తో వదిలేస్తున్న పోలీసులు
- తల్లిదండ్రుల్లో కనిపించని మార్పు

వాళ్లది తెలిసీ తెలియని వయసు.. రోడ్డుపై ఎలా వెళితే ఏం జరుగుతుందో తెలియదు.. ట్రాఫిక్ నిబంధనలు అస్సలు తెలియవు.. వీరికి బైకు దొరికితే అడ్డూ అదుపు ఏముంటుంది.. రోడ్లపై ఇష్టానుసారం డ్రైవింగ్ చేస్తూ.. వారు ప్రమాదాలకు గురికావడమే కాకుండా ఎదుటి వారి ప్రాణాల మీదకు తెస్తున్నారు. వీళ్లు పోలీసుల తనిఖీలో పట్టుబడుతున్నా.. చర్యలు చేపడితే భవిష్యత్ నాశనం అవుతుందనే ఉద్దేశ్యంతో కౌన్సెలింగ్ చేసి వదిలి పెడుతున్నారు. దీన్ని అలుసుగా తీసుకున్న కొంతమంది యువత రెచ్చిపోతున్నారు.

కడప క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివార్లలో రకరకాల బైకులతో వీళ్లు స్టంట్లు చేస్తూ కనిపిస్తున్నారు. ఒక్కో బైకులో ఒకరిద్దరు కాదు ఏకంగా ముగ్గురు, నలుగురు కూర్చుని వెళుతూ ప్రమాదాల బారినపడి విలువైన ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు జరుగుతున్నాయి. 18 ఏళ్లు నిండని మైనర్లు రయ్ మంటూ రాకెట్ వేగంతో రోడ్లపై దూసుకెళుతున్నారు. ఎక్కువగా స్కూటీలు, బైకులపై వెళుతూ కనిపిస్తున్నారు. ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు కళాశాలలకు ద్విచక్రవాహనాల్లో వెళుతున్నారు. కొన్ని కళాశాలల్లో వీళ్లకు అనుమతులు ఉండవు. అయినా కొందరు నేరుగా కళాశాలకు బైకులతో వెళుతున్నారు. ఒక్కో బైకులో ముగ్గురు లేదా నలుగురు కలిసి వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వీళ్ల ప్రధాన రహదారులే కాకుండా సందు గొందుల్లో కూడా వేగంగా వెళుతూ పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఇక 9, 10 తరగతులు చదువు



తున్న విద్యార్థులు సైతం బైకులు నడుపు తున్నా రు. ఇలాంటి వారు పోలీసుల తనిఖీలో పట్టుబ డుతున్నా... కౌన్సెలింగ్ చేసి వదిలేస్తున్నారు. దీన్ని అలుసుగా తీసుకొని రెచ్చిపోతున్నారు.

తల్లిదండ్రుల్లో బాధ్యత కరువు

తమ పిల్లలు మారాం చేశారనే, అలిగారనో లేక కొంత మంది తల్లిదండ్రులు వారికి బైకులు కొనిపిస్తున్నారు. 18 ఏళ్లు నిండకుండానే బైకులు నడపడం, లైసెన్సు కానీ, ఆర్సీ కానీ పొందలేరు. దీంతో కుటుంబ సభ్యుల పేరుతో బైకులు కొనుగోలు చేసి ఇస్తున్నారు. దీంతో మైనర్లకు ట్రాఫిక్ ఆంక్షలపై అవగాహన లేకపోవడంతో వాహనలను అదుపు చేసే సామర్థ్యం ఉండకపోవడంతో అతివేగం, నిర్లక్ష్యంతో డ్రైవింగ్ చేస్తున్నారు. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి వాళ్లు పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయినా వారిలో మార్పు రావడం లేదు. మళ్లీ పిల్లలకు వాహనాలు ఇచ్చి పంపుతుండడం గమనార్హం. ఇప్పటికైనా మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసులు కాస్త కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు.



ప్రత్యేక నిఘా ఉంచాం



మైనర్ల డ్రైవింగ్‌లపై ప్రత్యేక నిఘా పెట్టాం. కడప నగరంలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో ఉదయం, సాయంత్రం వేళ వాహన తనిఖీలు చేపడుతున్నాం. మైనర్లు పట్టుబడితే మొదట కౌన్సిలింగ్ చేయడంతో పాటు వారి తల్లిదండ్రులను కూడా పిలిపించి హెచ్చరిస్తున్నాం. రెండోసారి, మూడోసారి ఇలాగే జరిగితే మాత్రం చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

-జావేద్, కడప ట్రాఫిక్ సీఐ

రీ సర్వే సమస్యల పరిష్కారంలో కాలయాపన తగదు

● ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజక వ ర్గంలో రీసర్వేలో భాగంగా తలెత్తిన చిన్న చిన్న భూ సమస్యలను పరి ష్కరించకుండా రెవెన్యూ అధికారులు కాలయాపన చేయడం తగదని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. రైతాంగం శ్రేయ స్సును దృష్టిలో పెట్టుకొని మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. శుక్రవారం ఉదయం ఆయన తన ఇంటి వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని రైతాం గం రీసర్వే కారణంగా ఆన్‌లైన్‌లో భూమి వివరాలు లేకపోవడం, 1బీలు తదితరవి రాక మనోవేదనకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా తొండూరు, చక్రాయపేట మండలాల్లో పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. తొండూరు మండలంలోని భద్రంపల్లె పొలంలో 171 సర్వే నెంబర్‌లో 13.48 ఎకరాల భూమిలో ఆరుగురు రైతులు ఉన్నారన్నారు. ఇందులో రీసర్వే సందర్భంగా 40సెంట్ల భూమి అధికంగా చూపిస్తోందన్నారు. ఏ రైతు ఏ అభ్యంతరం చెప్పకపోయినా 2023 నుంచి ఇప్పటి వరకు ఆ సమస్యను పరిష్కరించకుండా అట్లే వదిలేశారన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లగా.. వారు కింది స్థాయి రెవెన్యూ అధికారులకు చెప్పినా పరిష్కరించలేదన్నారు. చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించామన్నారు. అందుకు రీసర్వే పూర్తయ్యే వరకు పాత రికార్డుల ప్రకారమే ఆన్‌లైన్‌లో 1బీలు వచ్చేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. అయినా ఆన్‌లైన్‌లో వివరాలు చూపడం లేదన్నారు. తొండూరు మండలంలో ఏడు గ్రామాలకు సంబంధించిన భూముల వివరాలు ఆన్‌లైన్‌లో చూపడం లేదన్నారు. రెవెన్యూ అధికారులు మే చివరి నాటికి రైతాంగ సమస్యలను పరిష్కరించకపోతే బాధిత రైతులతో పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తామన్నారు. టీడీపీ నాయకులు మైసూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

22 బైకులు స్వాధీనం

కొండాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకయ్యకాలువ గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటిని పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలోని అనుమానిత ప్రదేశాల్లోనూ విస్తృతంగా తని ఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా పత్రాలులేని 22 బైకు లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామసభను నిర్వ హించి.. కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. లేనిపోని గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. ముద్దనూరు, ఎర్రగుంట్ల సీఐలు దస్తగిరి, నరేష్, కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐలు ప్రతాప్‌రెడ్డి, హృషికేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఆలం సుబ్బరాయుడు మృతి

కడప, యర్రముక్కపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరి ప్రసాద్ బావ (చెల్లెలి భర్త) ఆలం సుబ్బ రాయుడు (69) శుక్రవారం సాయంత్రం 3.00 గంటలకు కడప నగరం రవి థియేటర్ దగ్గర గల వారి స్వగృహంలో మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలరు. పెద్ద కుమార్తె బెంగుళూరు, రెండవ కుమార్తె జర్మనీలో, కుమారుడు ఫ్రాన్స్‌లో ఉన్నారు. సుబ్బరాయుడు అసిస్టెంట్ సోషియల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పదవీ విరమణ పొందారు. వీరి స్వగ్రామం అన్నమయ్య జిల్లా కోడూరు తాలుక పెనగలూరు మండలంలోని వెలగచర్ల. సుబ్బరాయుడు అంత్యక్రియలు శనివారం ఉదయం 8.30 గంటలకు కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల శ్మశాన వాటికలో నిర్వహించనున్నట్లు హరిప్రసాద్ తెలిపారు. సుబ్బరాయుడు భౌతిక కాయాన్ని ప్రభుత్వ ఉన్నత ఉద్యోగులు, తోటి విశ్రాంత ఉద్యోగులు, పలువురు రాజకీయ నాయకులు సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ఆలం సుబ్బరాయుడు (ఫైల్)

ఎన్‌హెచ్ 440 రోడ్డు పనుల తనిఖీ



అనిమెలలో నేషనల్ హైవే పనులను తనిఖీ చేస్తున్న జేసీ

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాయచోటి-చాగలమర్రి నేషనల్ హైవే 440 పనులను జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తనిఖీ చేశారు. శుక్రవారం ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్ లక్ష్మీదేవితో కలిసి జేసీ తనిఖీ చేశారు. అనిమెల రెవెన్యూ గ్రామంలో రోడ్డు నిర్మాణంలో భాగంగా కట్టడాలు, భవనాలు, బోర్లు తదితర వివరాలను తెలుసుకొని అభ్యంతరాలను ఆరా తీశారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

కడప క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి మోటరుసైకిలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డ వ్యక్తికి 14రోజుల పాటు జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ కడప ఫస్ట్‌క్లాస్ స్పెషల్ కోర్టు తీర్పు ఇచ్చింది. పాలెంపల్లె ఆరోగ్యస్వామి అనే వ్యక్తి గురువారం మద్యం తాగి మోటరు సైకిలు నడుపుతూ కడప ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డాడు. ట్రాఫిక్ సీఐ జావీద్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా, శుక్రవారం జడ్జి పైవిధంగా తీర్పు నిచ్చినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులను మార్కుల యంత్రాలుగా మార్చకండి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను మార్కుల యంత్రాలుగా మార్చకూడదని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బి.లక్ష్మీరాజా తెలిపారు. శుక్రవారం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు - మార్కుల యంత్రాలు-విలువలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బి.లక్ష్మీరాజా, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నం ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకురాలిపై ఓ విద్యార్థి చెప్పుతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులపైన, సమాజంపై, ఉపాధ్యాయ, అధ్యాపకులపై ఉందన్నారు. యూటీఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డి.కృష్ణారెడ్డి, నరసింహులు, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీరాజా

లైసెన్స్ టెక్నికల్ పర్సన్‌కు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ టెక్నికల్ పర్సన్ అర్హత పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనరు రాముడు తెలిపారు. ఏపీలోని పురపరిపాలన మరియు పట్టణాభివృద్ధిశాఖ ఆదేశాల మేరకు పులివెందుల పురపాలక సంఘం పరిధిలో కొత్తగా లైసెన్సు టెక్నికల్ పర్సన్స్ లైసెన్స్ పొందడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ లైసెన్సు ద్వారా అభ్యర్థులు మున్సిపల్ పరిపాలన శాఖకు సంబంధించిన డీపీఎంఎస్ ద్వారా ప్రజలకు ఆన్‌లైన్‌లో భవన/లేఅవుట్ నిర్మాణ అనుమతుల కోసం అవసరమైన సాంకేతిక సేవలను అందించగలుగుతారన్నారు మూడేళ్ల ఆర్కిటెక్చర్ అసిస్టెంట్ లేదా ఇంటర్ ఇన్ ఆర్కిటెక్చర్ రెండేళ్ల అనుభవం లేదా డిప్లమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్‌తో పాటు డిగ్రీ ఇన్ ఆర్కిటెక్చర్ /డిప్లమా లేదా డిగ్రీ ఇన్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ తదితర అర్హతలు కలిగి ఉండి ఆసక్తి కలిగిన అభ్యర్థులు క్వాలిఫికేషన్ సర్టిఫికెట్, నిర్దీత రుసుము చెల్లించి మీ దగ్గరలో ఉన్న సచివాలయంలో లేదా మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో మీ దరఖాస్తును సమర్పిం చాలని తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి నేత్రదానం

పులివెందుల టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణం జొన్న వెంకటయ్య వీధికి చెందిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు రెంటా చిన్న పుల్లయ్య (76) మరణించడంతో ఆయన కుటుంబసభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. ఈమేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తంసేవా సమితి నేత్ర సేకరణ కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో మృతుని నివాసం వద్దకు వెళ్లి పార్థివ దేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు.

న్యాయమూర్తులకు సన్మానం

నందలూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నందలూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి నరసింహులు అధ్యక్షతన ఇన్‌చార్జి జడ్జిగా ఉన్న జూనియర్ సివిల్‌జడ్జి నందిని ధర్మవరానికి బదిలీ అయిన సందర్భంగా ప్రస్తుత ఇన్‌చార్జి, జూనియర్ సివిల్‌జడ్జి భార్గవి ఇరువురికి బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గొబ్బిళ్ల సుబ్బరామయ్య, జాయింట్ సెక్రటరీ నాయనపల్లె అనుదీప్, జయసింహ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ హస్తవరం ఆనంద్‌కుమార్, లేడి రిప్రెంజెంటేటివ్ మాడపూరి నళిని, న్యాయవాదులు సయ్యద్ అహ్మద్‌అలీ, కొప్పాల సుబ్రమణ్యం, వసుపులేటి శ్రీకర్, వనతల రాబిన్‌సన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి కాలగంగమ్మ తిరునాళ్లు



గుడిలో కొలువైన కాలగంగమ్మ తల్లి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కాలగంగమ్మతల్లి తిరుణాల నేటినుంచి రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మలకాటిపల్లె క్రాస్ వద్ద వెలసిన కాలగంగమ్మతల్లి తిరుణాలను శనివారం, ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు బోనాలు సమర్పిస్తారన్నారు. ఆలయ వెలుపల చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

చమర్తిని కలిసిన టీడీపీ నేత

సిద్దవటం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుతో శుక్రవారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు కలిశారు. ఆయనతో మాట్లాడుతూ పెంచలకోన బస్సు ఏర్పాటు చేయడంలో అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు కృషి మరువలేనిదన్నారు.

పాచిపట్టిన రోడ్లు.. జారి పడుతున్న ప్రజలు

● అస్తవ్యస్థంగా డ్రైనేజీ కాలువలు ● వెనక్కిపోయిన రూ.10 కోట్ల నిధులు ● కూటమి ప్రభుత్వంలోనైనా డ్రైనేజీ సమస్య పరిష్కారమయ్యేనా?

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అక్కడ రోడ్లపై నిత్యం మురుగు నీరు ప్రవహిస్తుండటంతో పాచిపట్టి జనం జారిపడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఒకప్పుడు లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించినా ఆ తర్వాత అధ్వానంగా తయారైంది. లక్కిరెడ్డిపల్లె చుట్టూ మొత్తం దాదాపు 25 వీధులు ఉన్నాయి. ఎక్కడే గానీ కాసింత డ్రైనేజీ కాలువ లేదు. ఎక్కడ పడితే నీరు అక్కడే ఆ వీధుల్లో వర్షాకాలం మాదిరిగా మురికినీరు ప్రవహి స్తోంది. వర్షాకాలం వస్తే లక్కిరెడ్డిపల్లెలో వీధులన్నీ దుర్గంధం భరించలేం. ఎన్నిసార్లు అధికారులకు ప్రజలు విన్నవించుకున్నా ఫలితం లేదు. తెల్లవారు లేచిన్నప్పటి నుంచి ప్రతి వీధిలో మురికినీరు ప్రవాహం ఉంటోంది. ప్రధానంగా అందెం లోటరీ బజార్‌లో ఇరుకుగా ఉన్న వీధిలో నీరు నిత్యం ప్రవహించడంతో పాచిబట్టి చాలా మంది ప్రమాదాలకు గురయ్యారు. కాళ్లు, చేతులు విరగొట్టుకుంటున్నారు. అయినా అధికారులకు చలనం లేదు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఒక పెద్ద మురికి గుంతలు దర్శనమిస్తున్నాయి. ఆ చుట్టూ ఉన్న 100 కుటుంబాలు నీరు ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకుంటుంది. అక్కడ నిత్యం పందులు నలంద నగర్ స్కూల్ నుంచి వేంపల్లి- రాయచోటి జాతీయ రహదారి వరకు మురికినరు నిత్యం వర్షాకాలం లాగే ప్రవహిస్తూనే ఉంటుంది. ఈ వీధిలో ఎస్బీఐ రెండు బ్యాంకులు ఉన్నాయి. ఇక్కడ నిత్యం ప్రజలు వందల సంఖ్యలో బ్యాంకుల వద్దకు వెళుతూ ఉంటారు. ఇక్కడ వెళ్లాలంటే ముక్కులు మూసుకొని వెళ్లాల్సిందేనని ప్రజలు అంటున్నారు. పాత మసీదు బీసీ బాలికల హాస్టల్ బాలసదనం హాస్టల్, పెద్దమసీదు, హనుమంతు బజార్ ఈ ప్రాంతాల్లో ఎక్కువుగా మురికినీరు ప్రవహిస్తూనే ఉంటుంది. ఈ మురికినీరులో చాలా మంది చిన్నపిల్లలు పడి గతంలో ప్రాణాలు కూ డా కోల్పోయారు. ఇక వర్షాకాలం వస్తే చెప్పాల్సిన అవసరం లేదు. రోగాలు ఈ ప్రాంతాల్లో చుట్టుముట్టి ఉం టాయి. ఎంతో మంది చిన్నారులు 2022 సంవత్సరంలో హనుమాన్ బజారు ప్రాంతంలో మృతి చెందారు. ఎంతో మంది డాక్టర్లు వచ్చి ఇక్కడ ఈ దుర్గంధాన్ని తీసివేయాలని చెప్పినా పట్టించుకునే నాధుడే లేరు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. 2014-18 సంవత్సరంలో డ్రైనేజ్ కోసం 10 కోట్ల రూపాయలు మం జూరు కాగా టెండర్లు ఆలస్యం కావడంతో వచ్చిన నిధులు వెనక్కి వెళ్లిపోయా యి. లక్కిరెడ్డిపల్లెలో ఏ వీధి చూసినా రోడ్డుపైన మురికినీరు కనిపిస్తుంది. వేంపల్లె- రాయచోటి జాతీయ రహదారి మిస్సా చర్చి వద్ద మెయిన్ రోడ్డులో మురికినీరు ప్రవహిస్తోంది. అక్కడ కూడా పందులు దుర్గంధంలో మునుగుతూ ఉంటాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం లక్కిరెడ్డిపల్లెలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ఈ సందర్భంగా పట్టణవాసులు కోరుతున్నారు.





ఆర్టీసీ బస్టాండు వద్ద నిల్వ ఉన్న మురికినీరు.. అముదం బజారులో రోడ్డుపై పారుతున్న మురుగు

ఎంతో మంది జారిపడ్డారు



ఈ బజారులో డ్రైనేజీ కాలువ లేక బజారులో నీరంతా 24 గంటలు ప్రవహిస్తూనే ఉంటాయి. బజారు మొత్తం పాచిపట్టిపోయింది. ఈ దారిన వెళ్లావారు జారిపడి కాళ్లు, చేతులు విరగ్గొటుకున్నారు. ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా ఎవ్వరూ పట్టించుకోలేదు.

- శివయ్య, ఆముదం బజారు, లక్కిరెడ్డిపల్లె

డ్రైనేజీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

లక్కిరెడ్డిపల్లెలోని డ్రైనేజీ సమస్య ఆరు నెలల క్రితం ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం డ్రైనేజీ కాలువలు మంజూరు చేస్తే తొందరలో పనులు పూర్తి చేస్తాం.

- సుదర్శన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

మురికినీటి మధ్య జీవిస్తున్నాం.. పట్టించుకోండి



లక్కిరెడ్డిపల్లెలోని కొత్త కొట్టాలు ప్రాంతంలో ఆర్టీసీ బస్టాండు వద్ద మురికినీరు ఏరులై పారుతోంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. వర్షాకాలం మా పరిస్థితి అగమ్య గోచరంగా ఉంటుంది. జ్వరాలు ఈ ప్రాంత వాసులకు ఎక్కువుగా వస్తాయి.

- ఆంజనేయులు, కొత్తకొట్టాలు

ఉపాధి హామీ పనుల తనిఖీ

సిద్దవటం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ తనిఖీల్లో భాగంగా ఉప్పరపల్లె, మాధవరం గ్రామాలు ఉపాధి హామీ పనులను శుక్రవారం ఏపీవో నరసింహులు ఆకస్మిక తనిఖీ చేపట్టి కూలీల నమోదు పరిశీలించారు. మండల కేంద్రమైన సిద్దవటం ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీవో నరసింహులు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని కూలీలు జాగ్రత్త వహించాలన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యాలయం ప్రారంభం

సంబేపల్లె, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎమ్మార్పీఎస్ నూతన కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు శుక్రవారం సంబేపల్లెలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సువర్ణ రాజు మాట్లాడుతూ విద్య, ఉద్యోగం, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సమానత్వం కోసం 30 ఏళ్లపాటు సుదీర్ఘ పోరాటం చేశామన్నారు. ఎన్నో త్యాగాలు ఫలితమే ఎస్సీ వర్గీకరణ అన్నారు. డా.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏపీ ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి అనుమతి తప్పనిసరి

సుండుపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సంచాయతీ కార్యదర్శి రామరాజు రామచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నివాస గృహాలు గానీ, వ్యాపార సముదాయాలు గానీ నిర్మిస్తే పంచాయతీ నుంచి భవన నిర్మాణ అనుమతులు ఆన్‌లైన్‌లో (కుడా) కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా అనుమతి తీసుకోవాలన్నారు. కొంతమంది దళారులు ఆన్‌లైన్ అనుమతులు ఇప్పిస్తున్నారని, అవి చెల్లవన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్ట్

నందలూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆడపూరు పంచాయతీలోని మల్లెపల్లె పొలాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్ఐ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి ఆయన మాట్లాడుతూ తమకు రాబడిన సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి దాడిచేయగా పేకాట ఆడు తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 6 మొబైల్, 2 స్కూటీలు, 15300 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

నిరాశాజనకంగా పదో తరగతి ఫలితాలు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఈ యేడాది జరిగిన పదో తరగతి పరీక్ష ఫలితాలు వెలువడడంతో మండల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలు ఈ యేడాది ఘోరంగా వచ్చాయి. గత యేడాదితో పోల్చితే ఈ యేడాది ఫలితాలు ఊహించని రీతిలో ఉన్నాయి. ఈ ఫలితాలను చూస్తే తప్పు ఎవరది అన్న ప్రశ్న తలెత్తుతున్నది. విద్యార్థులదా... తల్లిదండ్రులదా... ఉపాధ్యాయులదా తెలియాల్సి ఉంది. గత యేడాది 95 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ యేడాది 55 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఇందులో కూడా ప్రైవేటు పాఠశాలలో వంద శాతం సాధించడంతో ఈ శాతం అన్నా వచ్చింది. అదే ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణతే అయితే కేవలం 45 శాతం మాత్రమే ఉంది. ఈ యేడాది ప్రభుత్వ పాఠశాలలో 262 మంది పరీక్షలు రాయగా కేవలం 123 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. అదే గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల నుంచి 255 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 241 మంది ఉత్తీర్ణత సాధించారు.

ప్రతిఒక్కరూ నడుంబిగించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శేఖర్

రాజంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మలేరియాను అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని డీఎంహెచ్‌వో ఎస్.శేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఈడిగపాలెం, మన్నూరు అర్బన్ హెల్త్‌సెంటర్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డాకటర్‌లు చైతన్యం, స్నేహలత, రాజశేఖర్, మలేరియా సబ్‌యూనిట్ అధికారులు ఎస్ఎస్ దాస్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మలేరియాను కలిసికట్టుగా అంతం చేద్దాం

నందలూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మలేరియాను మనతోనే అంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా రాజంపేట సబ్‌యూనిట్ పరిధిలో స్థానిక పీహెచ్‌సీలో మలేరియాపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాధ్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ దాస్, టీబీ సూపర్‌వైజర్ జయప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేద్దాం

సంబేపల్లె, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని సంబేపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారులు సూర్యనారాయణ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వారు తమ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా వ్యాప్తి, నివారణ చర్యలు, పరిణా మాల గురించి వివరించారు. 2030 నాటికి మలేరియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని పిలుపునిచ్చారు.

అందరిలో మార్పు రావాలి

సిద్దవటం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మలేరియా అంతం కావాలంటే అందరిలో మార్పు రావాలని డాక్టర్ ప్రకాష్ అన్నారు. మలేరియా దినోద్సవం సందర్భంగా జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తపల్లె మాధవరం, సిద్దవటం ప్రభుత్వ వైద్యశాలలలో దోమల వ్యాప్తిని అరికట్టుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ ప్రకాష్, దీపక్, సాయివరప్రసాద్, లక్ష్మీకర్, హరిహరన్, శ్రీవాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

రాజంపేట టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మున్సిపాలిటి పారిశుధ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన పారిశుధ్య కార్మికులు కొండయ్య, సీతమ్మ, విజయమ్మలకు శుక్రవారం రాజంపేట మున్సిపల్ కార్యాలయంలో వీడ్కోలు సభ ని ర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై పదవీ విరమణ పొందిన పారిశుధ్య కార్మికులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈశ్వర్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ సూర్యమోహన్, టౌను ప్లానింగ్ ఆఫీసర్ రెహమాన్, సీఐటీయూ నాయకులు చిట్వేలి రవికుమార్, పీవీ రమణ, లక్ష్మీదేవి, ప్రసాద్, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు టీడీపీ పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాలకు చెందిన ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. ముక్కా ఫౌండేషన్ ద్వారా అనేక మందికి సాయం అందిస్తున్నామన్నారు.

తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం



సమస్యలు పరిష్కరించాలని తెలుపుతున్న నాయకులు

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):ఎంపీడీవో కార్యాలయంలోని సభాభవనంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రభుత్వ విప్, అరవ శ్రీధర్ హాజరవుతారని ఎదురు చూసి 11 గంటల సమయానికి సభను ప్రారంభించారు. ఎంపీపీ చీరల నాగమ్మ అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. పశువైద్యాధికారి, ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ, ఐసీడీఎస్ విద్యాశాఖ, విద్యుత్, హౌసింగ్, వెలుగు, రెవెన్యూ శాఖకు సంబంధించిన అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులు తెలియజేసి ఉన్న అవకాశాలను వివరించారు. నూతన గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా రు. రెవెన్యూశాఖ అధికారులు మాట్లాడుతూ రేషన్‌కార్డులకు ప్రతిఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. చిన్నంపల్లె గ్రామ పంచాయతీకి సంబంధించిన ఎంపీటీసీ, సర్పంచ్ సుబ్బరాజు పంచాయతీలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు.ఎంపీపీ నాగమ్మ, జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీనరసయ్య, వైస్ ఎంపీపీ గౌరీశంకర్ రాజు, పీఆర్‌డీ ఇ.బాలసుబ్రమణ్యం, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

పాకిస్థాన్ భారీ మూల్యం చెల్లించక తప్పదు







రైల్వేకోడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్... సిద్దవటం: కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న అతికారి కృష్ణ... సుండుపల్లిలో ర్యాలీ

- జనసేన రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 25:(ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడిపై పాకిస్థాన్ భారీ మూల్యం చెల్లించక తప్పదని జనసేన రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ హెచ్చరించారు. శుక్రవారం రైల్వేకోడూరు గాంధీ విగ్రహం వద్ద నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉగ్రవాదులు కశ్మీర్‌లో జరిపిన దాడుల్లో పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాదులు ఉన్నారని తెలిపారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, జనసేన నాయకులు జోగినేని మణి, పగడాల చంద్రశేఖర్, పగడాల వెంకటేష్, ఉత్తరాది శివకుమార్, ఆలం రమేష్, అమర్, సభాపతి, ముద్దపోలు సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో...

విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి దరిశా వెంకటరెడ్డి, కాళప్పగారి రాము, మల్లికార్జున, బీజేపీ నాయకులు తోట శ్రీనివాసులు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ముస్లింలు ఉగ్రవాదులకు నిరసనగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పఠాన్ మౌలా, జుబేర్, మస్తాన్, ఇర్ఫాన్, కలీల్, గులాం తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడులు పిరికిపంద చర్య: అతికారి కృష్ణ

సిద్దవటం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాద దాడులు పిరికిపంద చర్య అని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ అన్నారు.యాత్రికులపై తీవ్రవాదులు జరిపిన కాల్పుల్లో 28 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర చింతన కలిగిస్తోందన్నారు. ఈ దుశ్చర్యను ఖండిస్తూ సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామ పంచాయతీ శుక్రవారం సాయంత్రం జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పాల్గొని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మాధవరం-1 గ్రామం పంచాయతీలోని పార్వతీపురం గ్రామం భద్రావతి భావనారాయణ గుడి వద్ద నుంచి మాధవరం-1 బస్టాండు వరకు భారీ ర్యాలీ జరిగింది. అనంతరం మానవహారం కార్యక్రమం నిర్వహించారు. కూటమి నేతలు, గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎస్ఐ మహ్మద్‌రఫీ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉగ్రవాద దాడి అత్యంత హేయమైన చర్య

సుండుపల్లి:మార్చి 25(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి అత్యంత హేయమైన చర్య అని సంఘ సేవకుడు డాక్టర్ సయ్యద్ ఆహ్మద్, మైనార్టీ నాయకులు తెలిపారు. శుక్రవారం సుండుపల్లి మండల కేంద్రంలో ముస్లిం, మైనార్టీలు ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి మారణకాండ పునరావృతం కాకుండా కఠిన చర్యలు తిసుకోవాలన్నారు.

ఉగ్రవాదులను కాల్చి చంపాలి

రాజంపేట టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాం సంఘటనలో ఉగ్రవాదులు సృష్టించిన మారణహోమానికి నిరసనగా రాజంపేట ఆర్యవైశ్య సంఘం నేతలు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. శుక్రవారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి సంఘం నేతలు కొవ్వొత్తులతో ర్యాలీగా పాతబస్టాండు వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో తలిశెట్టి రమేష్, జితేంద్ర, నాగేంద్ర, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 25 ఆంధ్రజ్యోతి): హిందువులపై ఉగ్రవాదులు దాడిచేయడం హేయమైన చర్య అని విశ్వహిందూ పరిషత్ జిల్లా జనరల్ సెక్రటరీ గజపతి రాజు పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మూడురోడ్ల కూడలిలో కొవ్వొత్తులతో మానవహారం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు క్రిష్ణ, విశ్వహిందూ పరిషత్ నాయకులు యనమల విశ్వనాథ, టీడీపీ మండల యూత్ ప్రెసిడెంట్ కొలిమి పక్కీరయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ పాల్గొన్నారు.

పహల్గాం ఉగ్ర దాడికి నిరసనగా ర్యాలీ

పుల్లంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా పుల్లంపేటలో శుక్రవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలు చేతబట్టి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పుల్లంపేటలో భారీ ర్యాలీ చేపట్టారు. విశ్వహిందూ పరిషత్ అన్నమయ్యజిల్లా కార్యదర్శి జయసింహ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. హిందూ పరిషత్ ప్రాంత పెంచలరెడ్డి, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, కరస్పాండెంట్ నూకల శ్రీరాములు పాల్గొన్నారు.







రాజంపేట: కొవ్వొత్తుల ర్యాలీలో ఆర్యవైశ్యులు... లక్కిరెడ్డిపల్లెలో... రైల్వేకోడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

రాజంపేట... సమస్యలు తిష్ఠ



- దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలు
- నాలుగు వైపులా అధ్వానమైన రోడ్లు
- కనీస అభివృద్ధి లేక అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు


రాజంపేటలో బస్‌స్టాపు లేక ఎర్రటి ఎండలో అలమటిస్తున్న ప్రయాణికులు

రాజంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గంలో అనేక దీర్ఘకాలిక సమస్యలున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. అనేక ఏళ్లుగా ఈ సమస్యలు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నా వాటి పరిష్కార మార్గం వైపు నాయకులు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా కడప-రేణిగుంట రాష్ట్ర రహదారిలో ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు పెరిగిపోయాయి. వాహనాలకు తగ్గట్టు దారి వెడల్పు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీనివల్ల ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ రోడ్డును 4 లేన్లుగా ఏర్పాటు చేసి పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం కలగలేదు. ప్రధానంగా ఈ రహదారి రాజంపేట ప్రజలకే కాక కోడూరు, కడప, కమలాపురం ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు, కర్నూలు, బళ్లారి, మహారాష్ట్ర వాసులు తిరుమలకు ఎక్కువగా ఈ రహదారిలోనే వెళుతుంటారు. దీనికి సుమారు రూ.3600 కోట్లు రెండేళ్ల కిందటే మంజూరయ్యాయి. రెండేళ్ల కిందటే ఈ పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. అయితే కోడూరు నుంచి రేణిగుంట వరకు అటవీ మార్గంలో వెళ్లే రహదారికి కేంద్ర ప్రభుత్వం జంగిల్ క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. ఇంతవరకు ఇవ్వకపోవడం వల్ల ఆ రోడ్డు పనులు జరగడం లేదు.

అదేవిధంగా రాజంపేట నుంచి రాయచోటికి, రాజంపేట నుంచి రాపూరుకు వెళ్లే రెండు ఘాట్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాజంపేట నుంచి జిల్లా కేంద్రమైన రాయచోటికి రోడ్డుమార్గం పూర్తిగా పాడై ఉంది. రెండు ఘాట్ అటవీ మార్గంలో వెళ్లే ఈ రహదారికి డబుల్‌లేను కూడా పూర్తి చేయలేదు. రాపూరుకు, నెల్లూరుకు వెళ్లే మార్గంలో అన్నమయ్య జిల్లా సరిహద్దు వరకు డబుల్ లేను రోడ్డు పనులు పూర్తి చేశారు. నెల్లూరు జిల్లా సరిహద్దు నుంచి రాపూరు వరకు రోడ్డును వదిలేశారు. ఘాట్‌రోడ్డులో రోడ్డు వేయకపోవడం వల్ల ఈ మార్గంలో ప్రయాణం చేయడం చాలా కష్టంగా ఉంది.


నందలూరు చెయ్యేటిలో శిథిలావస్థకు చేరుకున్న రక్షిత మంచినీటి పథకం

పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో అన్ని రహదారులు ఇరుకిరుకుగా ఉన్నాయి. రైల్వేస్టేషన్‌కు వెళ్లాలన్నా, పాతబస్టాండు నుంచి మార్కెట్‌కు రావాలన్నా వెడల్పు లేని రోడ్లతో పూర్తిగా రోడ్లన్నీ ఆక్రమణలతో ట్రాఫిక్ ఎక్కువై ఎటూ పోలేని పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. అసలు పట్టణంలో ద్విచక్ర వాహనం పెట్టుకోవాలన్నా ఇబ్బందిగా ఉంది. వెంటనే రాజంపేట పట్టణంలో రోడ్లను వెడల్పు చేయాల్సి ఉంది. ఇక హత్యరాల, తాళ్లపాక, రాజంపేట ప్రాంతాలను అనుసంధానం చేసి చుట్టూ రోడ్డు సౌకర్యాన్ని కల్పించి పుణ్యక్షేత్రాలైన అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక, పాపవినాసినిగా పేరొందిన హత్యరాల, రాజంపేట ప్రాంతంలో టూరిస్టు హబ్‌గా ఏర్పాటు చేయదలచిన అంశం మరుగునపడిపోయింది. పట్టణానికి ప్రధానంగా చక్రాలమడుగు నది సుందరీకరణ ప్రధానమైనది. పట్టణంలోని మురికినీరు అంతా రాజంపేట పట్టణ నడిబొడ్డున ఉన్న చక్రాలమడుగుకు చేరుతోంది. ఈ నీటిని దిగువ ప్రాంతాలకు పంపి ఆక్రమణలకు గురైన చక్రాలమడుగును సుందరీకరణ చేసి చెట్ల పెంపకాన్ని చేపట్టి పర్యావరణ పరిరక్షణ నిర్వహిస్తే పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉంటాయి. సుండుపల్లె, వీరబల్లె వాసులకు ప్రధాన సమస్య నీటి సమస్య. కావున వెనువెంటనే ఈ మండలాల్లో చెయ్యేరు నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాలను పూర్తి చేసి తాగునీటి సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉంది.

అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిన తర్వాత ఆ ప్రాజెక్టు మార్గంలో 800 కోట్లతో పునరుద్ధరించాలన్న ప్రాజెక్టు పనులు అక్కడికక్కడే నిలిచిపోయాయి. నిధులు లేని వల్ల ఈ పనులు ఇప్పుడు ప్రారంభించే అవకాశాలు లేవు. దీనికి ప్రయత్నంగా చెయ్యేరు పొడవునా సుమారు 70 కిలోమీటర్ల వ్యవధిలో ఐదు కిలోమీటర్లకు ఒక చెక్‌డ్యాంను ఏర్పాటు చేసి వర్షాకాలంలో నీరు చెక్‌డ్యాంలకు చేర్చి భూగర్భజలాలు పెరిగి సస్యశ్యామలం అవుతుంది. నియోజకవర్గంలో ఒంటిమిట్ట, రాజంపేట, నందలూరు, ప్రాంతాల్లో ఎక్కువ చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిని పునరుద్ధరించి పూడికలు తీసి కాలువలు మరమ్మతులు చేస్తే ఈ నీటి వనరుల ద్వారా తాగునీటి సౌకర్యం ఏర్పడుతుంది. ప్రధానంగా రాజంపేట నుంచి వీరబల్లెకు, సుండుపల్లెకు, సిద్దవటం, ఒంటిమిట్ట, నందలూరు, మండల కేంద్రాల్లోని గ్రామీణ ప్రాంతాలకు సరైన బస్సు సౌకర్యం లేదు. గతంలో రాజంపేట ఆర్టీసీలో 150 బస్సులు ఆర్టీసీవి ఉండగా అవి ఇప్పుడు 70 బస్సులకు కుదించారు. అద్దె బస్సులతోనే పట్టణాలకు బస్సులు నడుపుతున్నారు. పల్లె ప్రాంతీయులు బస్సులు లేక ఆటోలు, మోటారు సైకిళ్లపై ప్రయాణం చేయాల్సి వస్తోంది. కావున అదనపు బస్సులు ఏర్పాటు చేయాల్సి ఉంది.

చెరువులు, కాలువలు, కుంటలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. వెంటనే ఈ ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. ఈ విధంగా నియోజకవర్గంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారు. అధికార పార్టీలో ఎమ్మెల్యే లేకపోవడం, ఉన్న నేతల్లో నాయకత్వ పోరు వల్ల తమ రాజకీయ ఉనికికోసమే పోరాడుతున్నారే తప్ప నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించేవారు కరవయ్యారు.


నిధులు లేక నిలిచిపోయిన రాజంపేట-రాయచోటి రోడ్డు పనులు

ఇన్‌చార్జి మంత్రికి విన్నవించాం



రాజంపేట నియోజకవర్గంలోని పలు సమస్యల గురించి అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి విజ్ఞాపన పత్రాన్ని అందించాము. నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని మంత్రి దృష్టికి తీసుకుపోయాము. రోడ్లు, ఆక్రమణల సమస్య, తదితర అన్ని సమస్యలను మంత్రి దృష్టికి లిఖితపూర్వకంగా విజ్ఞాపన పత్రాన్ని అందించాము. త్వరలో ఈ పనులపై సమీక్షించి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

- ప్రతాప్‌రాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, రాజంపేట

నాలుగు లేన్ల రోడ్లపై కేంద్ర మంత్రితో చర్చించాం

కడప-రేణిగుంట నాలుగులేన్ల రోడ్ల పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి ద్వారా ఇటీవలే ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చలు జరిపి విజ్ఞాపనపత్రాలను కూడా అందజేశాం. త్వరలో ఫారెస్ట్ క్లియరెన్స్ వచ్చిన వెంటనే పనులు చేపడతామని మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు. త్వరలో ఈ పనులు ప్రారంభం కానున్నాయి.


నాలుగు లైన్ల రోడ్లపై కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న సాయిలోకేష్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాజంపేటటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో శుక్రవారం రెడ్డిచర్ల చిన్నప్ప(50) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... చిన్నప్ప గొర్రెల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇందులో భాగంగా గూడూరులో గొర్రెలను కొని వాటిని సానిపాయిలోని స్వగృహానికి వచ్చే మార్గమధ్యంలో రోళ్లమడుగు సమీపంలో మినీ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో చిన్నప్ప తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో వారు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. కాగా చిన్నప్పకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గాదెల వీఆర్‌ఏపై దాడి


గాయపడిన వీఆర్ఏ పెంచలయ్య

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదెల గ్రామ పంచాయతీలోని విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ కొత్త పెంచలయ్యను అదే గ్రామానికి చెందిన వ్యక్తి కర్రతో దాడి చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ మహేష్ తెలిపారు. నూకనపల్లె గ్రామ పరిధిలో రెవెన్యూశాఖ రీసర్వే కార్యక్రమంలో విధులు నిర్వహించి తమ సొంత గ్రామమైన గాదెలకు వెళ్లడంతో గ్రామంలో ఉన్న కొత్త మణి అను వ్యక్తి పాతకక్షలు మనసులో పెట్టుకుని దాడి చేయడంతో తలకు గాయమై తీవ్ర రక్తస్రావమైంది. దీంతో అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొన్నారు. అనంతరం తహసీల్దారు శ్రీధర్‌రావు ఆసుపత్రికి వచ్చి బాధితుడిని పరామర్శించి వీఆర్‌ఏపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో ఆకస్మిక తనిఖీలు


పోస్టాఫీసులో తనిఖీ చేస్తున్న వెంకటరెడ్డి

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె పోస్టాఫీసును శుక్రవారం కర్నూలు రీజనల్ పోస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ బీపీ వెంకటరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోస్టల్‌శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజల్లోకి చేరువయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అలాగే పొదుపు ఖాతాలు, బీమా పాలసీలు, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పోస్టల్ ఏఎస్పీ రామశంకర్, ఇన్‌స్పెక్టర్ జయశంకర్ వెంట ఉన్నారు. కార్యక్రమంలో సబ్‌పోస్టుమాస్టర్ శ్రీనివాసులు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురం కోర్టు ఏజీపీగా
శ్రీనివాసులు నియామకం

కలికిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా బొలిశెట్టి శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఆయన ఈ కోర్టులో ప్రభుత్వం తరఫున సివిల్ కేసులను వాదిస్తారని ఉత్తర్వులో పేర్కొన్నారు. మూడేళ్లపాటుగానీ ఆలోగా జారీ చేసే ఉత్తర్వుల మేరకుగానీ ఆయన ఏజీపీగా కొనసాగనున్నారు. నెలకు రూ.10 వేల గౌరవ వేతనం చెల్లించనున్నట్లు పేర్కొంటూ రాష్ట్ర న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి. ప్రభావతి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

గంగమ్మతల్లి జాతరకు పటిష్ట బందోబస్తు

- డ్రోన్ కెమెరాతో జాతర కార్యక్రమాలపై నిఘా
- రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్‌హెగ్డే

రైల్వేకోడూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు గంగమ్మతల్లి జాతర కార్యక్రమాలు ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్‌హెగ్డే తెలిపారు. శుక్రవారం మొదట గంగమ్మతల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గంగమ్మజాతర ప్రాంతాలు, దారులు తదితర వాటిని పరిశీలించారు. రైల్వేకోడూరుకు ఎక్కువగా భక్తులు వస్తారు కాబట్టి డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జేబు దొంగలపై పటిష్ట నిఘా ఉంటుందన్నారు. చుట్టుపక్కల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు తెలిపామన్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెల 29న పోలీసులు రైల్వేకోడూరుకు చేరుకుంటారని ఏఎస్పీ తెలిపారు. జాతరలో ఎలాంటి సమస్య వచ్చినా అందుకు నిర్వాహకులే బాధ్యులుగా ఉండాలని ఆదేశించారు. ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు సీఐ కే.హేమసుందరరావు, ఎస్ఐ నవీన్‌బాబు, జాతర కమిటీ చైర్మన్ రాంబాబు, కమిటీ సభ్యులు పోకల సుబ్బరాయుడు, పంద్రా పెద్దోడు, పోతురాజు నవీన్, పోతురాజు సుమన్, ఉంగరాల చంద్ర, చెన్నంశెట్టి సుబ్బా, కదిరి సాయి, ఉంగరాల సాయి, యెలిశెట్టి శంకర్ తదితరులు పాల్గొన్నారు.


గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న ఏఎస్పీ

కేసుల్లో పురోగతి సాధించాలి

కేసుల్లో పురోగతి సాధించాలని రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్‌హెగ్డే తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన పలు కేసులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియతో మాట్లాడుతూ కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించామన్నారు. సీఐ కె.హేమసుందరరావు, ఎస్ఐ జి.నవీన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్ట్రాటెక్ భూముల కాలుష్యంపై ఆర్డీవో విచారణ

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ చిలంకూరులోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో శుక్రవారం పర్యటించారు. ఇటీవల ఫ్యాక్టరీపై జరుగుతున్న దుమారం, వివాదం చినికిచినికి గాలివానలా మారుతోంది. గతంలో ఫ్యాక్టరీకి 2200 ఎకరాల భూములు తీసుకున్నారు. అయితే ఇటీవల ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి యాజమాన్యానికి మధ్య వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఐసీఎల్ చుట్టూ ఉన్న భూముల్లో పంటలు పండించుకోలేక పోతున్నామని, ఐసీయల్ నుంచి వచ్చే కాలుష్యం తీవ్రంగా ఉందని, కలమల్ల గేటు వద్ద రోడ్లు నాశనమయ్యాయని, సమీప గ్రామాలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని, గతంలో ఉన్న స్కూల్స్ మూసివేశారని, వైద్యం అందించం లేదన్న విమర్శలున్నాయి. బ్లాస్టింగ్‌తో ఇళ్లు, భూముల్లో పగుళ్లు వచ్చాయని, తమకు ఉపాధి కల్పించడం లేదని, వీటిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదులు రావడంతో ఆయన ఆర్డీవోను విచారణకు పంపినట్లు తెలిసింది. ఆర్డీవోను కలిసిన రైతులు, ఎంపీటీసీలు కూడా ఆర్డీవోకు తమ సమస్యలను వివరించారు. అయితే విలేకరులకు, స్థానిక భూములు కోల్పోయిన వారికి సమాచారం ఇవ్వకుండా ఈ విచారణ చేశారు. స్థానికంగా ఉన్న ఎంపీటీసీ నవీన్‌కుమార్, బీజేపీ నాయకుడు సత్యం స్వామి, కొందరు రైతులతో ఆర్డీవో మాట్లాడారు. అనంతరం యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడారు. కాలుష్య నివారణ మండలి అధికారులతో కలిసి ఆమె కాలుష్యాన్ని పరిశీలించారు. ఈ విచారణ అనంతరం పూర్తి నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు సమాచారం. ఈ విషయంపై తహసీల్దార్ శోభన్ బాబును వివరణ అడుగగా ఆర్డీవో చిలమకూరు అల్ట్రాటెక్‌లో అధికారులతో, కొందరు రైతులతో మాట్లాడారని తెలిపారు.


ఐసీయల్ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో, పక్కనే తహసీల్దార్ శోభన్‌బాబు

ఉపాధి పనుల్లో రూ.20 లక్షలు దుర్వినియోగం

- ఏపీవోపై ఎంపీపీ ఆగ్రహం

పుల్లంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 'మీ ఇష్టం వచ్చినట్లు ఉపాధి పనులు జరుగుతున్నాయి. లక్షలాది రూపాయలు దుర్వినియోగమవుతున్నాయి. ఏసీ రూములో కూర్చొని ఏమి చేస్తున్నావ్? మీ వాటా ఎంత? టీఏ వాటా ఎంత? ఈసీ ఎంత అంటూ ఏపీవో శ్రీనివాసులుపై మండల అధ్యక్షుడు ముద్దా బాబుల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మండలంలో జరిగిన ఉపాధి అక్రమాలపై ఆధారాలతో సహా ఎంపీపీ అధికారులకు సూచించారు. మండలంలోని వత్తలూరు పంచాయతీలో జనాభా 4250 కాగా అక్కడ పనిచేసే కూలీలు వెయ్యి మంది. ఇది సాధ్యమా ? 150 మంది కూలీలు వస్తే వెయ్యి మంది పేర్లు నాలుగైదు మస్టర్లలో ఒకే ఫొటోలు, కాని కూలీల పేర్లు మాత్రం వేరు. మస్టర్‌లో ఉన్న ఫొటోల్లో ఒక గ్రామానికి చెందినవారు ఉంటే కూలీలు పేర్లు మాత్రం మరో గ్రామానికి చెందినవారివి ఉన్నాయని, దీనిపై సమాధానం చెప్పాలని ఎంపీపీ ఏపీవోను నిలదీశారు. తిప్పాయపల్లె పంచాయతీలో రౌడీషీటర్ క్రిమినల్‌గా ఉన్న వ్యక్తిగా మేట్‌గా ఎలా పనిచేస్తారు. మండలంలో 21 పంచాయతీల్లో మొత్తం కూలీలు 3029 మంది. ఒక వత్తలూరు పంచాయతీలో వెయ్యి మంది కూలీలు 20 లక్షలకు పైగా దుర్వినియోగమైంది. అనంతసముద్రం పంచాయతీలో కక్షలు, ఘర్షణలకు మీరు ఆజ్యం పోస్తున్నారంటూ ఏపీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఏపీవో శ్రీనివాసులు సభలో మట్లాడుతూ గత ఐదేళ్లుగా ఇలానే జరుగుతుందని చెప్పడంతో తమ ప్రభుత్వంలోనే చర్యలు తీసుకోవాలని ఎన్నోసార్లు చెప్పా అంటూ ఎంపీపీ సభకు వివరించారు. పుల్లంపేట మండలంలో 176 గ్రామాలు ఉండగా ప్రతి గ్రామంలో 2 నుంచి 4 బెల్ట్ షాపులు ఉన్నాయని, ఒక్కో బాటిల్‌పై రూ.80 అదనంగా వసూలు చేస్తున్నారని, దీనిపై ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. శ్మశాన స్థలం ప్రహరీ కూల్చివేత, బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ సీఐ పాత్ర, ఉపాధి అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు ఉపాధి హామీ పీడీకి, ఎక్సైజ్ కమిషనర్‌కు తీర్మానం చేసి పంపాలని, ఎంపీపీ ఎంపీడీవో వరప్రసాద్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అరవిందకిషోర్, మండల ఉపాధ్యక్షుడు బోగా వెంకటసుబ్బరత్నమ్మ, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


ఉపాధి అక్రమాలపై ఆధారాలు చూపిస్తున్న ఎంపీపీ

పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- డీఆర్వో మధుసూదన రావు


పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షపై సమీక్షిస్తున్న డీఆర్‌వో మధుసూదనరావు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో మధుసూదన రావు తెలిపారు. తన చాంబర్‌లో శుక్రవారం ఆయన ప్రవేశ పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వర్తించి ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు ఏర్పాటు చేయాలని మునిసిపాలిటీ వారిని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని తహసీల్దార్లను ఆదేశించారు. గ్రామీణ విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా రవాణా సౌకర్యం కల్పించాలని రవాణా శాఖాధికారులను ఆదేశించారు. హెల్త్ టీమ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఎదురుకాకుండా చూడాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. పరీక్ష పూర్తయ్యేంత వరకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. సమావేశంలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె, కలికిరి పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

పులివెందుల వైద్య కళాశాల ప్రొఫెసర్ రిటైర్‌మెంట్‌కు అనుమతి

కలికిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలలో సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ డి.శంకర్‌రెడ్డి రాజీనామాను ఆమోదిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యక్తిగత కారణాలతో ఆయన రాజీనామా చేసిన 2024 జూలై 29 నుంచి ఈ రాజీనామా అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి.హోస్‌మణి శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

ఫారెస్టు సెక్షన్ ఆఫీసరుకు పదోన్నతి

కలికిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వ్యక్తిగత సహాయకురాలిగా పనిచేస్తున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసరు ఓ.రష్మీ మణికి డిప్యూటీ రేంజరుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెను రాజంపేట రేంజి తుమ్మలబయలు సెక్షను డిప్యూటీ రేంజి ఆఫీసరుగా నియమించింది. అయితే, రష్మీ మణి ఎమ్మెల్యే పీఏగా కొనసాగుతారని, ఆ మేరకు అన్నమయ్య జిల్లా కలెక్టరు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.వి.శేషగిరిబాబు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

తొమ్మిది మంది బైండోవర్

రామసముద్రం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 9 మంది సారా, కర్ణాటక మద్యం అక్రమ అమ్మకాల నిందితులు పార్వతమ్మ, సునీల్‌బాబు, భానుప్రకాష్, పవిత్ర, మంగమ్మ, వెంకటరమణ, మంజుల, రవిలను శుక్రవారం స్థానిక తహసీల్దార్ నిర్మలాదేవి ముందు బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ జబావుల్లా తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీ రికార్డులు స్వాధీనం

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్లపల్లె పంచాయతీ రికార్డులను శుక్రవారం డీఎల్‌పీవో నాగరాజు స్వాధీనం చేసుకున్నారు. చేపలవేలం డబ్బు విషయంపై పోతుపేట సర్పంచ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డీఎల్‌పీవో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు బూర్లపల్లె ఇంచార్జ్ కార్యదర్శి విష్ణు తెలిపారు.

రయ్ రయ్ మంటూ...



- మైనర్ల ర్యాష్ డ్రైవింగ్ ● ప్రమాదాల బారిన యువత
- ఎదుటి వారి ప్రాణాలు మీదకు తెస్తున్న వైనం
- కౌన్సెలింగ్‌తో వదిలేస్తున్న పోలీసులు
- తల్లిదండ్రుల్లో కనిపించని మార్పు

వాళ్లది తెలిసీ తెలియని వయసు.. రోడ్డుపై ఎలా వెళితే ఏం జరుగుతుందో తెలియదు.. ట్రాఫిక్ నిబంధనలు అస్సలు తెలియవు.. వీరికి బైకు దొరికితే అడ్డూ అదుపు ఏముంటుంది.. రోడ్లపై ఇష్టానుసారం డ్రైవింగ్ చేస్తూ.. వారు ప్రమాదాలకు గురికావడమే కాకుండా ఎదుటి వారి ప్రాణాల మీదకు తెస్తున్నారు. వీళ్లు పోలీసుల తనిఖీలో పట్టుబడుతున్నా.. చర్యలు చేపడితే భవిష్యత్ నాశనం అవుతుందనే ఉద్దేశ్యంతో కౌన్సెలింగ్ చేసి వదిలి పెడుతున్నారు. దీన్ని అలుసుగా తీసుకున్న కొంతమంది యువత రెచ్చిపోతున్నారు.

కడప క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివార్లలో రకరకాల బైకులతో వీళ్లు స్టంట్లు చేస్తూ కనిపిస్తున్నారు. ఒక్కో బైకులో ఒకరిద్దరు కాదు ఏకంగా ముగ్గురు, నలుగురు కూర్చుని వెళుతూ ప్రమాదాల బారినపడి విలువైన ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు జరుగుతున్నాయి. 18 ఏళ్లు నిండని మైనర్లు రయ్ మంటూ రాకెట్ వేగంతో రోడ్లపై దూసుకెళుతున్నారు. ఎక్కువగా స్కూటీలు, బైకులపై వెళుతూ కనిపిస్తున్నారు. ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు కళాశాలలకు ద్విచక్రవాహనాల్లో వెళుతున్నారు. కొన్ని కళాశాలల్లో వీళ్లకు అనుమతులు ఉండవు. అయినా కొందరు నేరుగా కళాశాలకు బైకులతో వెళుతున్నారు. ఒక్కో బైకులో ముగ్గురు లేదా నలుగురు కలిసి వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వీళ్లు ప్రధాన రహదారులే కాకుండా సందు గొందుల్లో కూడా వేగంగా వెళుతూ పాద చారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఇక 9, 10 తరగతులు చదువు



తున్న విద్యార్థులు సైతం బైకులు నడుపు తున్నా రు. ఇలాంటి వారు పోలీసుల తనిఖీలో పట్టుబ డుతున్నా... కౌన్సెలింగ్ చేసి వదిలేస్తున్నారు. దీన్ని అలుసుగా తీసుకొని రెచ్చిపోతున్నారు.

తల్లిదండ్రుల్లో బాధ్యత కరువు

తమ పిల్లలు మారాం చేశారనే, అలిగారనో లేక కొంత మంది తల్లిదండ్రులు వారికి బైకులు కొనిపిస్తున్నారు. 18 ఏళ్లు నిండకుండానే బైకులు నడపడం, లైసెన్సు కానీ, ఆర్సీ కానీ పొందలేరు. దీంతో కుటుంబ సభ్యుల పేరుతో బైకులు కొనుగోలు చేసి ఇస్తున్నారు. దీంతో మైనర్లకు ట్రాఫిక్ ఆంక్షలపై అవగాహన లేకపోవడంతో వాహనలను అదుపు చేసే సామర్థ్యం ఉండకపోవడంతో అతివేగం, నిర్లక్ష్యంతో డ్రైవింగ్ చేస్తున్నారు. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి వాళ్లు పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయినా వారిలో మార్పు రావడం లేదు. మళ్లీ పిల్లలకు వాహనాలు ఇచ్చి పంపుతుండడం గమనార్హం. ఇప్పటికైనా మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసులు కాస్త కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు.



ప్రత్యేక నిఘా ఉంచాం



మైనర్ల డ్రైవింగ్‌లపై ప్రత్యేక నిఘా పెట్టాం. కడప నగరంలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో ఉదయం, సాయంత్రం వేళ వాహన తనిఖీలు చేపడుతున్నాం. మైనర్లు పట్టుబడితే మొదట కౌన్సెలింగ్ చేయడంతో పాటు వారి తల్లిదండ్రులను కూడా పిలిపించి హెచ్చరిస్తున్నాం. రెండోసారి, మూడోసారి ఇలాగే జరిగితే మాత్రం చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

-జావేద్, కడప ట్రాఫిక్ సీఐ

ఘనంగా హజరత్ మాసాబీబీ ఉరుసు



మాసాబీబీ దర్గా ఉరుసులో కడప పెద్ద దర్గా పీఠాధిపతి అరిఫుల్లాహుస్సేని

పెద్దమండ్యం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుషావతినది తీరంలో ఉన్న హజరత్ మహబూబ్ సుబహాని, మాసాబీబీ దర్గా ఉరుసు సందర్భంగా గురువారం రాత్రి గంధం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మాసాబీబీ దర్గా వద్ద కడప పెద్దదర్గా గురువులు అరిఫుల్లాహుస్సేని గంధం చదివించారు. శుక్రవారం రాత్రి పాట కచేరీ నిర్వహించారు. ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, కలిచెర్ల సింగల్ విండో మాజీ ఛైర్మన్ కడప సుధాకరరెడ్డి, రాజంపేట టీడీపీ నేత సుగవాసి సుబ్రమణ్యంతో పాటు దర్గా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో పోలీసుల కార్డన్ సెర్చ్

వాల్మీకిపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరమ్మకాలనీ, దయ్యాలబండ ప్రాంతాల్లో శుక్రవారం వేకువజామున పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని పలు ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించారు. అనంతరం సీఐ ప్రసాద్‌బాబు, కాలనీ వాసులతో మాట్లాడుతూ అనుమానిత వ్యక్తులు, వాహనాలు తారసపడితే తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కాలనీల్లో నాటుసారా, అక్రమ వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఆయా చర్యలను మానుకోకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇచ్చి ప్రోత్సహించరాదని, వారివల్ల ఏదైనా ప్రమాదం జరిగితే వాహన యజమానులే పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు చంద్రశేఖర్, మధురామచంద్రుడు, శ్రీహరి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం జరిగిన ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు రామసముద్రం మండలం పాతరాజుపల్లెకు చెందిన రవిచంద్ర కుమారుడు ప్రకాష్ (25), చెంబకూరు సమీపంలోని నల్లచిన్నేపల్లెకు చెందిన శ్రీనివాసులురాజు(35) బైకులు కొమ్మోరుపల్లె వద్ద ఎదురుఎదురుగా ఢీకొన్నాయి. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కురబకోట మండలం దొమ్మనబావి వద్ద ఆటో, క్వాలిస్ వాహనం ఢీకొనడంతో ఐదుగురు గాయపడ్డారు. అంగళ్లు నుంచి వెళుతున్న ఆటో, ములకలచెరువు నుంచి వస్తున్న క్వాలిస్ వాహనాలు దొమ్మన్నబావి వద్ద ఢీ కొన్నాయి. దీంతో రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి, వారిలో షాబీర్ (21)అబ్దుల్ (19), సాహిద్ (19) మహారాష్ట్రకు చెందినవారు కాగా, నరసింహులు (25)మంజునాథ్ (31) దొమ్మన్నబావికి చెందిన వారు. క్షతగాత్రులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ముదివేడు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

దాడిలో ముగ్గురికి గాయాలు



దాడిలో గాయపడిన ముగ్గురు యువకులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య గొడవలో కొందరు వ్యక్తులు తలదూర్చడంతో పాటు, ముగ్గురు యువకులను గాయపరిచారు. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు నెమలినగర్ వడ్డిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు విజయ్ (26) తన భార్య నందినితో బుధవారం గొడవ పడ్డాడు. ఈ గొడవలో తలదూర్చిన వడ్డిపల్లెకు చెందిన మణి, రెడ్డిశేఖర్, నందిని కర్రలతో దాడి చేయడంతో అదే గ్రామానికి చెందిన విజయ్, రెడ్డిశేఖర్, చంద్రశేఖర్ గాయపడ్డారు. స్థానికులు గాయపడిన వారిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మదనపల్లె వన్‌టౌన్ సీఐ ఎరిసావలి తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న యువకుడు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం విషం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాలూకా పోలీసుల కథనం మేరకు మదనపల్లె మండలం, కోళ్లబైలు పంచా యతీ వైఎస్సార్ జగన్ కాలనీకి చెందిన సయ్యద్ కుమారుడు ఆర్షిద్ (30) విషం తాగి స్పృహ కోల్పోవడంతో కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరమ్మకాలనీలో ఉద్రిక్తత

గుర్రంకొండ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో గుర్రంకొండ పట్టణం ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం సాయంత్రం గొడవ జరిగింది. తన భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకుని, తమ కుటుంబలో కలహాలకు కారణమవుతున్నావంటూ స్థానిక సచివాలయం ఎదుట టీ దుకాణం నిర్వహిస్తున్న ఓ మహిళతోపాటు, ఆమె బంధువులు గొడవపడ్డారు. సమాచారం అందుకుని అక్కడికి చేరిన పోలీసులు గొడవపడుతున్న యువకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆ యువకుల బంధువులు, కుటుంబ సభ్యులు స్టేషన్ వద్దకు చేరుకొనడంతో, లోపలికి వెళ్లకుండా గేటు మూసేశారు. అనంతరం స్టేషన్ లోపలికి కొందరిని మాత్రమే అనుమతించి మాట్లాడారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం సీజ్

వాల్మీకిపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ఐషర్ వాహనాన్ని శుక్రవారం సాయంత్రం వాల్మీకిపురం పోలీసులు సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. రాయచోటి నుంచి కర్ణాటకకు అక్రమంగా రేషన్ బియ్యం రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం తెల్లవారుజామున స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ దాడులు నిర్వహించారు. వాహనంలోని 2,769 కిలోల బియ్యాన్ని సీజ్ చేయడంతోపాటు బీహార్‌కు చెందిన సౌరవ్‌కుమార్, భూషణ్‌కుమార్‌ను అరెస్టు చేయగా, జమీల్‌బాషా అనే వ్యక్తి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రీ సర్వే సమస్యల పరిష్కారంలో కాలయాపన తగదు

● ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజక వ ర్గంలో రీసర్వేలో భాగంగా తలెత్తిన చిన్న చిన్న భూ సమస్యలను పరి ష్కరించకుండా రెవెన్యూ అధికారులు కాలయాపన చేయడం తగదని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. రైతాంగం శ్రేయ స్సును దృష్టిలో పెట్టుకొని మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. శుక్రవారం ఉదయం ఆయన తన ఇంటి వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని రైతాం గం రీసర్వే కారణంగా ఆన్‌లైన్‌లో భూమి వివరాలు లేకపోవడం, 1బీలు తదితరవి రాక మనోవేదనకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా తొండూరు, చక్రాయపేట మండలాల్లో పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. తొండూరు మండలంలోని భద్రంపల్లె పొలంలో 171 సర్వే నెంబర్‌లో 13.48 ఎకరాల భూమిలో ఆరుగురు రైతులు ఉన్నారన్నారు. ఇందులో రీసర్వే సందర్భంగా 40సెంట్ల భూమి అధికంగా చూపిస్తోందన్నారు. ఏ రైతు ఏ అభ్యంతరం చెప్పకపోయినా 2023 నుంచి ఇప్పటి వరకు ఆ సమస్యను పరిష్కరించకుండా అట్లే వదిలేశారన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లగా.. వారు కింది స్థాయి రెవెన్యూ అధికారులకు చెప్పినా పరిష్కరించలేదన్నారు. చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించామన్నారు. అందుకు రీసర్వే పూర్తయ్యే వరకు పాత రికార్డుల ప్రకారమే ఆన్‌లైన్‌లో 1బీలు వచ్చేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. అయినా ఆన్‌లైన్‌లో వివరాలు చూపడం లేదన్నారు. తొండూరు మండలంలో ఏడు గ్రామాలకు సంబంధించిన భూముల వివరాలు ఆన్‌లైన్‌లో చూపడం లేదన్నారు. రెవెన్యూ అధికారులు మే చివరి నాటికి రైతాంగ సమస్యలను పరిష్కరించకపోతే బాధిత రైతులతో పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తామన్నారు. టీడీపీ నాయకులు మైసూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22 బైకులు స్వాధీనం



బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొండాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకయ్యకాలువ గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటిని పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలోని అనుమానిత ప్రదేశాల్లోనూ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా పత్రాలులేని 22 బైకు లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామసభను నిర్వహించి.. కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. లేనిపోని గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముద్దనూరు, ఎర్రగుంట్ల సీఐలు దస్తగిరి, నరేష్, కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐలు ప్రతాప్‌రెడ్డి, హృషికేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు మృతి



జ్ఞానేంద్రప్రసాద్ (ఫైల్)

కలికిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు జ్ఞానేంద్ర ప్రసాద్ (26) గురువారం రాత్రి మృతి చెందాడు. వాయల్పాడు మండలం టీఎం లోయ సమీపంలో సోమవారం బొలేరో వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో కలికిరికి చెందిన కాకర్ల శంకరయ్య కుమారుడు కాకర్ల జ్ఞానేంద్ర ప్రసాద్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వాయల్పాడు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగుళూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వాయల్పాడు ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

కడప క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి మోటరుసైకిలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డ వ్యక్తికి 14రోజుల పాటు జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ కడప ఫస్ట్‌క్లాస్ స్పెషల్ కోర్టు తీర్పు ఇచ్చింది. పాలెంపల్లె ఆరోగ్యస్వామి అనే వ్యక్తి గురువారం మద్యం తాగి మోటరు సైకిలు నడుపుతూ కడప ట్రాఫిక్ పోలీసులకు పట్టుబ డ్డాడు. ట్రాఫిక్ సీఐ జావీద్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా, శుక్రవారం జడ్జి పైవిధంగా తీర్పు నిచ్చినట్లు సీఐ తెలిపారు.

ఎన్‌హెచ్ 440 రోడ్డు పనుల తనిఖీ



అనిమెలలో నేషనల్ హైవే పనులను తనిఖీ చేస్తున్న జేసీ

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాయచోటి-చాగలమర్రి నేషనల్ హైవే 440 పనులను జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తనిఖీ చేశారు. శుక్రవారం ఆర్‌డీఓ చెన్నయ్య, తహసీల్దార్ లక్ష్మీదేవితో కలిసి జేసీ తనిఖీ చేశారు. అనిమెల రెవెన్యూ గ్రామంలో రోడ్డు నిర్మాణంలో భాగంగా కట్టడాలు, భవనాలు, బోర్లు తదితర వివరాలను తెలుసుకొని అభ్యంతరాలను ఆరా తీశారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి నేత్రదానం

పులివెందుల టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణం జొన్న వెంకటయ్య వీధికి చెందిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు రెంటా చిన్న పుల్లయ్య (76) మరణించడంతో ఆయన కుటుంబసభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. ఈమేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృ త హస్తంసేవా సమితి నేత్ర సేకరణ కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో మృతుని నివాసం వద్దకు వెళ్లి పార్థివ దేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు.

విద్యార్థులను మార్కుల యంత్రాలుగా మార్చకండి



మాట్లాడుతున్న లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను మార్కుల యంత్రాలుగా మార్చకూడదని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బి.లక్ష్మీరాజా తెలిపారు. శుక్రవారం ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు - మార్కుల యంత్రాలు-విలువలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బి.లక్ష్మీరాజా, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నం ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకురాలిపై ఓ విద్యార్థి చెప్పుతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులపైన, సమాజంపై, ఉపాధ్యాయ, అధ్యాపకులపై ఉందన్నారు. యూటీఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డి.కృష్ణారెడ్డి, నరసింహులు, రవి తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలి



మదనపల్లె పట్టణంలో ర్యాలీ చేస్తున్న మాజీ సైనికుల సంఘం సభ్యులు


గుర్రంకొండలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న హిందువులు


పీలేరు చౌడేశ్వరి నగరలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు


నిమ్మనపల్లె: ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న జనసేన నాయకులు



మదనపల్లెలో కొవ్వొత్తులప్రదర్శన నిర్వహిస్తున్న జనసేన నాయకులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం మదనపల్లెలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పహల్గామ్ వద్ద ఉగ్రదాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతఛాందసవాదులు అమాయకుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి రజాక్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం పీలేరు అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, లక్ష్మీనారాయణ, రాయుడు, వెంకటస్వామి, ప్రతాప్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ: పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ శుక్రవారం గుర్రంకొండలో బీజేపీ, జనసేన నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా బస్టాండు వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులను తక్షణమే శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో గోపి, అమరనాథ్, కిశోర్, రాజ, రమేష్, శ్రీనివాసులు, రామాంజులు, మోహన్, శ్రీన, చందు తదితరులు పాల్గొన్నారు.

పీలేరు : ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారికి ఆత్మశాంతి కలగాలని పీలేరులోని చేనేత కార్మికులు శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తిరుపతి మార్గంలోని చౌడేశ్వరి చేనేత నగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఉగ్రవాదంపై చేస్తున్న పోరాటంలో మన సైనిక బలగాలకు విజయం చేకూరాలని చౌడేశ్వరి ఆలయంలో ప్రార్థనలు చేశారు. రాష్ట్ర చేనేత కార్మిక సంఘ నాయకులు రాధాకృష్ణ, పోలిశెట్టి సురేంద్ర, మడక మదనమోహన, పల్లా కృష్ణయ్య, జ్యోతి, రమాదేవి, మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి: మతోన్మాద మారణకాండకు నిరసనగా జనసేన మండల అధ్యక్షుడు ప్రదీప్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూభారత దేశంలో అలజడి సృష్టించేందకే పాక్ కుట్రలు చేస్తున్నదని తెలిపారు. ఎట్టి పరిస్థితిలోనూ ఉగ్రవాదులను తుడిచిపెట్టేయాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరత్, తానేశ్వర్, సురేష్, తదితరలు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: ఉగ్రవాదుల దాడిని ముక్త కంఠంతో ఖండిస్తున్నామని మదనపల్లె జనసేన పార్టీ నాయకుడు శ్రీరామ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలో చిత్తూరు, బెంగళూరు బస్టాండుల్లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షుడు జగదీష్‌బాబు, బాలాజీ, రమణ, శంకర్, కుమార్, హర్షనవాజ్, ఉమా, సోను, సురేష్, కుషల్, రాజేష్, సాయి, జితేంద్ర, వీరహిళలు హాసిని, శ్వేత, స్వాతి, ఆసిపా, సుజాతమ్మ, అరుణ, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని అనిబిసెంట్ సర్కిల్‌లో ఏపీ ఎస్‌యూపీ సంస్థ సభ్యులు, హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయంలో ఆ సంస్థ సభ్యులు కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ సంస్థల వ్యవస్థాపకులు ప్రణయ్, అబూబకర్ మాట్లాడుతూ భారతదేశం తన సత్తా చూపించడంతోపాటు, మృతుల కుటుంబసభ్యులకు మనోధైర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపీఎస్ యూపీ సంస్థ సభ్యులు మహేష్, ఇలియాజ్, ఖాదర్‌వలి, ప్రవీణ్, అఫ్రోజ్, సురేష్, జనార్థన్, హరినాథరెడ్డి, డాక్టర్ అజంతుల్లాఖాన్, హెల్పింగ్‌మైండ్‌స సభ్యులు వాలంటరీ బ్లడ్‌బ్యాంకు అధికారి బాలచంద్రనాయుడు, దినకర్, చైతు, కిరణ్, సాంబ, చరణ్, నవీన్, నరేష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోండి

బి.కొత్తకోట/రామసముద్రం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం పేద విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో ఉచితంగా ప్రవేశం పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బి.కొత్తకోట ఎంఈవో రెడ్డిశేఖర్ రామసముద్రం ఎంఈవో హేమలత వేర్వేరుగా పిలుపునిచ్చారు. శుక్రవారం వారు మాట్లాడుతూ అన్ని ప్రైవేటు స్కూళ్లలో 25శాతం సీట్లను ప్రభుత్వం పేదలకు కేటాయించిందన్నారు. ఈ సీట్ల కోసం ఏప్రిల్ 28 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఇందులో అనాథలకు 5శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనారిటీలకు 6శాతం సీట్లు కేటాయించారని, సంవత్సరాదాయం 1,44,000లకు మించని వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ సీట్లను వృథాగా వదలకుండా అర్హులైన పిల్లలు లబ్ధిపొందాలని ప్రచారం చేస్తున్నట్లు ఎంఈవో తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

గుర్రంకొండ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్ శుక్రవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని రామానాయునిచెరువులోని ఇసుకను కొంత కాలంగా అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు.

న్యాయమూర్తులకు సన్మానం

నందలూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నందలూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి నరసింహులు అధ్యక్షతన ఇన్‌చార్జి జడ్జిగా ఉన్న జూనియర్ సివిల్‌జడ్జి నందిని ధర్మవరానికి బదిలీ అయిన సందర్భంగా ప్రస్తుత ఇన్‌చార్జి, జూనియర్ సివిల్‌జడ్జి భార్గవి ఇరువురికి బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గొబ్బిళ్ల సుబ్బరామయ్య, జాయింట్ సెక్రటరీ నాయనపల్లె అనుదీప్, జయసింహ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ హస్తవరం ఆనంద్‌కుమార్, లేడి రిప్రెంజెంటేటివ్ మాడపూరి నళిని, న్యాయవాదులు సయ్యద్ అహ్మద్‌అలీ, కొప్పాల సుబ్రమణ్యం కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి కాలగంగమ్మ తిరునాళ్లు


గుడిలో కొలువైన కాలగంగమ్మ తల్లి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కాలగంగమ్మతల్లి తిరుణాల నేటినుంచి రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మలకాటిపల్లె క్రాస్ వద్ద వెలసిన కాలగంగమ్మతల్లి తిరుణాలను శనివారం, ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు బోనాలు సమర్పిస్తారన్నారు. ఆలయ వెలుపల చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు.

చమర్తిని కలిసిన టీడీపీ నేత

సిద్దవటం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుతో శుక్రవారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు కలిశారు. ఆయనతో మాట్లాడుతూ పెంచలకోన బస్సు ఏర్పాటు చేయడంలో అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు కృషి మరువలేనిదన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తేనే భవిష్యత్తు

● డీపీఓ నాగరాజు


ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో నాగరాజు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతంగా విధులు నిర్వహించే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు భవిష్యత్తు ఉంటుందని మదనపల్లె డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన ఈవోపీఆర్డీ మునిప్రతాప్, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్‌తో కలసి పీటీఎంలోని సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల అభివృద్ధికి గ్రామస్థాయి నాయకులు, సర్పంచ్‌ల సమన్వ యంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్, ఈవో పీఆర్డీ మునిప్రతాప్, పంచాయతీ కార్యదర్శులు మనోహర్, విద్యావతి, కొండా శివప్రసాద్, సురేఖ, శ్వేత, ప్రమీలా, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై నిఘా పెట్టండి : ఐసీడీఎస్ పీడీ


చాకలమిట్ట అంగన్‌వాడీ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ వస్తోంది.. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్ల వర్కర్లు, హెల్పర్లు అప్రమత్తంగా ఉండి బాల్య వివాహాలను అడ్డుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి సూచించారు. శుక్రవారం మదనపల్లె పట్టణంలోని చాకలిగుట్ట, నక్కలదిన్నె నార్త్ అంగన్‌వాడీ సెంటర్లను సీడీపీవో సుజాతతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్‌లోని బియ్యం, పప్పు, ఆయిల్‌ను తనిఖీ చేశారు. చౌకదుకాణాల నుంచి వచ్చిన సరుకులను ఎక్స్‌పైరీ డేట్ చూసి తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించిన బొమ్మనచెరువు సెక్టార్ సమావేశంలో వర్కర్లకు పలు సూచనలు ఇచ్చారు. బాలింతలు, గర్భిణుల ఇళ్ల వద్దకు వెళ్లి పోషకాహారం పంపిణీ చేసేటప్పుడు తప్పని సరిగా ఎఫ్‌ఆర్‌ఎస్ విధానంలో ఫొటోలు తీసి, పోషణ్‌ట్రాక్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రీస్కూల్ చిన్నారుల హాజరును నమోదు చేస్తూ ప్రతి ఒక్కరు అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని చోట్ల చిన్నారులు వయసుకు తగ్గ బరువు లేరని, అలా కాకుండా ప్రతి చిన్నారినీ ప్రతి వారం బరువు తూచి, తగిన పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో సింగిల్ సెక్షన్ బడులు నడుస్తున్నాయని, అంగన్‌వాడీలు సమయ పాలనతో చిన్నారులను తీసుకొచ్చి, తిరిగి ఇంటికి చేర్చాలన్నారు. సూపర్‌వైజర్లు చంద్రకాంత, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి


మదనపల్లె: మలేరియా దినం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న మదనపల్లె మలేరియా టీం సభ్యులు


పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న తలపుల, రేగళ్ల పీహెచ్‌సీల వైద్య ఆరోగ్య సిబ్బంది

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మలేరియాను మనమే అంతమొందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్‌బాబు పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పీహెచ్‌సీలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, మలేరియా యూనిట్ అధికారి ఖలీలుల్లాఖాన్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. దోమతెరలు వాడడం ద్వారా మలేరియా, డెంగ్యు, చికెన్‌గున్యా, మెదడువాపు, బోదకాలు, జికా వైరస్ తదితర వ్యాధుల బారినపడకుండా రక్షణ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీధర్, అనుపమ, జిలానీ, డీఈవో భాస్కర్, యుపిహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లి : దోమల నియంత్రణ అందరి బాధ్యత అని డాక్టర్ ప్రత్యూష అన్నారు. ప్రపంచ మలేరియా దినాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు ప్రబలే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ఇళ్ల వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, కొబ్బరి చిప్పలు, నీటి నిల్వలు, గుంతలు వంటివి లేకుండా చూడాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో మలేరియా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పీలేరు : మండలంలోని తలపుల, రేగళ్ల పీహెచ్‌సీల సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నిర్లక్ష్యం చేస్తే మలేరియా వ్యాధి ప్రాణాంతకం అవుతుందని, దాని గురించి అవగాహన చేసుకుని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బస్టాండు వరకు వరకు ర్యాలీ నిర్వహించారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు 'మలేరియా అంతం-అందరి పంతం', 'జ్వరమా...మలేరియా కావచ్చు' అంటూనినాదాలు చేశారు. ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా పీలేరు సబ్-యూనిట్ అధికారి విద్యాసాగర్, సీహెచ్‌వో విజయలక్ష్మి, హెచ్‌ఈ కొండయ్య, సూపర్‌వైజర్లు మోహన్, కుసుమ, పవన్ కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : స్థానిక వైద్యాధికారులు, సిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు సనాఆయేషా, కిరణ్‌బాబు, సీహెచ్‌వో ఇందిరారాణి, సూపర్‌వైజర్లు సుధాకర్, భానుబీ, హెల్త్‌ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫి, టీబీ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


నిమ్మనపల్లి: ప్రపంచ మలేరియా దినం సందర్భంగా ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది



వాల్మీకిపురం మండలం చింతపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక నాయని చెరువుపల్లె రోడ్డులో శుక్రవారం కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహి ళల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారన్నారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ వెలుగు సంఘాలను ఏర్పాటు చేసి మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడుకే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో హరినారాయణ, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, కురబలకోట మండల కన్వీనర్ వైజీ సురేంద్రయాదవ్, తులసీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

ములకలచెరువు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దపాళ్యం మల్లికార్జున కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను కోరారు. నీటి సమస్యలు పరిష్కరించి ఎస్సీ ఎస్టీ నిధులు వారి అభివృద్ధికే వినియోగించాలని, ములకలచెరువు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఎస్పీ ఉపాధ్యక్షుడు మంచాల నరసింహులు, నాయకులు కృష్ణప్ప, వినోద్‌కుమార్, భాస్కర్, అంజి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల కుటుంబాలు డాక్యుమెంట్లు సరిచేసుకోవాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు, వారి కుటుంబాలకు డాక్యుమెంటేషన్ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కడప సైనిక్ వెల్ఫేర్ అధికారి రజాక్ తెలిపారు. శుక్రవారం స్థానిక శుభం కల్యాణ మండపంలో మదనపల్లె, పీలేరు, పుంగనూరుకు చెందిన మాజీ సైనికుల సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. మాజీ సైనికుల కుటుంబ సభ్యులు వారి పుట్టిన తేదీలు, ఇతర వివరాలను సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. వీటితో పాటు ఇతర డాక్యుమెంటేషన్ ప్రక్రియకు చిత్తూరు సోల్జర్ బోర్డు అధికారి రాఘవులు, 8 మంది క్లర్కులు వచ్చి మాజీ సైనికులకు అవసరమైన డాక్యుమెంటేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికల సంఘం మదనపల్లె, పీలేరు, పుంగనూరు సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న జంగంపల్లె ఉపాధ్యాయులు

పీలేరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తమ విద్యార్థులకు పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ జంగంపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. హెచ్‌ఎం తాటిపర్తి గంగాధరం ఆధ్వర్యంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్.మమత(577), టి.పూజ(574), ఎస్.రేవతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షరీఫ్, రేణుక, బీవీ రమణ, ఫరూఖ్, రమణయ్య, ఆనంద రాజు, అశోక్ కుమార్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కలికిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అగ్ని కీలలు చుట్టుముడితే ఏ విధంగా రక్షించుకోవాలనే అంశాలపై శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్రి ప్రమాదాలు ఎదురైనప్పుడు మంటలు వ్యాప్తి చెందకుండా ఎలా నిలువరించాలి, వాటిని ఆర్పడానికి నీరు, ఇసుకలాంటి పదార్థాలను ఎలా ఉపయోగించాలి అన్న విషయాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వాయల్పాడు స్టేషన్ ఫైర్ ఆఫీసరు షేక్ మస్తాన్, సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్, అగ్నిమాపక సిబ్బంది నాగిరెడ్డి, వెంకట రమణ, చైతన్య, సీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

కర్ణాటక హజ్ కమిటీ చైర్మన్‌ను కలిసిన పఠాన్ ఖాదర్‌ఖాన్

మదనపల్లె, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ జుల్ఫికర్ అహ్మ ద్ఖాన్, కర్నాటక హజ్ కమిటీ సభ్యులు, ఎమ్మెల్సీ జబ్బార్ ముజాహిద్‌ను ఏపీ హజ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్ కలిశారు. ఎమ్మెల్యే షాజాహాన్‌బాషా ఆదేశాల మేరకు శుక్రవారం మత పెద్దలతో కలసి బెంగళూరులో కలిసి సన్మా నించారు. కర్ణాటక మీదుగాహజ్ కు వెళ్లే యాత్రికులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తా మని ఈ సందర్భంగా కర్ణాటక హజ్ కమిటీ సభ్యులు హామీ ఇచ్చినట్లు పఠాన్ ఖాదర్‌ఖాన్ తెలిపారు. సోహెల్‌బాషా, సద్దాం హుస్సేన్, సర్కాజీ ఏజాజ్ అహ్మద్, హాజీ అఫ్సర్ బాషా, అబ్దుల్ పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న జిల్లా సీపీఐ కార్యదర్శి నర్సింహులు

బి.కొత్తకోట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేసి పేదలను ఆదుకోవాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బి.కొత్తకోటలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పహల్గావ్ మృతులకు సంతాపం ప్రటించిన అనంతరం పీఎల్ నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కిష్టప్ప మాట్లాడుతూ తల్లికివందనం, రైతు భరోసా పథకాల కోసం మహిళలు, రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. పడమటి మండలాలలో కరువును నివారించేందుకు హంద్రీ-నీవా కాలువ ద్వారా అందుబాటులో ఉన్న చెరువులను నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని, గ్రామాలలో నీటి ఎద్దడిని నివారించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఇళ్లపట్టాలు, పింఛన్లు, నూతన కాలనీలలో మౌలికవసతుల కోసం తాము ఇచ్చిన అర్జీలపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బషీర్‌ఖాన్, రఘునాథ్, అష్రఫ్‌అలీ, తంబయ్యశెట్టి, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సంక్షేమమే ప్రభుత్వ ఎజెండా



కృతజ్ఞతలు తెలుపుతున్న నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకులు

మదనపల్లె టౌన్ 25(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సంక్షేమమే ఎజెండాగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని టీడీపీ నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యుడు ఎం. ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో కేశ ఖండన పనిచేస్తున్న నాయిబ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేల నుంచి రూ.25వేల వరకు కమిషన్ పెంచిందన్నారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయిబ్రాహ్మణుల సంఘం నాయకులు రామకృష్ణ, మనోహర్, మంజునాథ్, ఈశ్వర్, నాగరాజు, పాండు, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.

తాగునీరు వృథా చేయరాదు

రామసముద్రం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తాగు నీరు వృథా చేయరాదని ఈవోపీఆర్‌డీ గఫూర్ సూచించారు. మండలంలోని కాప్పల్లి పంచాయతీ అజ్జంరెడ్డిపల్లెను సందర్శించిన ఆయన తాగునీటి పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొళాయిల వద్ద నీరు వృథా కాకుండా చూసుకోవాలన్నారు. పైపులైను లీకేజీలు అరికట్టాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దిన్నెమీద దిగువ హరిజనవాడలో తాగునీటి ట్యాంకును పరిశీలించి, ట్యాంక్‌ను తరచూ శుభ్రం చేయాలని, పైపులకు మరమ్మతులు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణమ్మ, తిప్పరాజు, పంచాయతీ కార్యదర్శి బాబామస్తాన్, ఇంజనీర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో కోర్టులో గంగమ్మ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకుడు అమ్మవారిని పుష్పాలతో అలంకరించాడు. మహిళలు రాహుకాల సమయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మకు చీర, జాకెట్లు, పొంగళ్లు సమర్పించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్న రెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రంగస్వామి నాయుడు, కరుణాకర్‌నాయుడు, మార్పూరి విక్కీ, మార్పూరి మహేష్, దేవేంద్ర, శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.